


గురుకులాల్లో ఖాళీలకు దరఖాస్తు చేసుకోవాలి

బాన్సువాడ టౌన్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): బాన్సువాడలోని రాజారాం దుబ్బాలో సామాజిక కార్యకర్త సంతోష్ గురుకులాల్లో ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని ఆదివారం విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు వివరించారు. ప్రభుత్వం 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినందున పేద విద్యార్థులు చదువుకోవడానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ఫిబ్రవరి ఒకటోవ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు.



రిజర్వేషన్ల కోసం.. ఎదురు చూపులు!

- జీపీ ఎన్నికల రిజర్వేషన్లపై ఆశావహుల్లో ఉత్కంఠ
- పోటీలో ఉంటున్నట్లు ప్రచారం చేసుకుంటున్న నాయకులు
- పల్లెల్లో మొదలైన సందడి
- ఇప్పటికే గుర్తులు ఖరారు చేసిన ఎన్నికల సంఘం

కామారెడ్డి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సర్పంచ్‌గా పోటీ చేసే ఆశావహులు ప్రభుత్వం ప్రకటించే రిజర్వేషన్ల కోసం ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. పలు పంచాయతీల్లో సర్పంచ్ పదవికి పోటీ చేసే ఆశావహుల సంఖ్య ఎక్కువగానే ఉంది. వీరంతా ప్రజల మద్దతు కూడగట్టుకునేందుకు ఇప్పటికే వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తూ భారీగా ఖర్చు చేస్తున్నారు. గ్రామాల్లో జరిగే పండుగలు, శుభ కార్యాలకు హాజరవ్వడమే కాకుండా మృతుల కుటుంబాలను పరామర్శించడం, క్షతగ్రాతులను పలుకరిస్తు బాధితులకు సహాయం అందిస్తున్నారు. రిజర్వేషన్ల కోసం ఇటీవల కులగణన సర్వే ప్రభుత్వం నిర్ణయించడంతో ఆశావహుల్లో గుబులు నెలకొంది. రిజర్వేషన్ ఏది వస్తుందో అంచనా వేయలేక అయోమయానికి గురవుతున్నారు. అధికార పార్టీలో ఆశావహుల సంఖ్య అధికంగానే ఉంది. ప్రతిపక్షపార్టీలైన బీఆర్ఎస్, బీజేపీల నుంచి కూడా సర్పంచ్ స్థానానికి పోటీ చేసి తమ సత్తా చాటేందుకు నాయకులు సన్నద్ధం అవుతున్నారు.

రిజర్వేషన్లపై అంచనా వేయలేని పరిస్థితి

పంచాయతీ ఎన్నికల్లో తమ గ్రామానికి రిజర్వేషన్ ఏం వస్తుందోనని నాయకులు అంచనా వేయలేకపోతున్నారు. గతంలో నాలుగైదు పర్యాయాలు వచ్చిన రిజర్వేషన్లను బేరీజు వేసుకుని రొటేషన్ పద్ధతిలో తమ గ్రామానికి పలానా రిజర్వేషన్ వస్తుందని గతంలో చెప్పగలిగేవారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం వరుసగా 10 ఏళ్ల పాటు పంచాయతీ రిజర్వేషన్లను ఖరారు చేసింది. అయితే జనాభాలో అధికంగా ఉన్న బీసీలకు రాజకీయంగా అన్యాయం జరుగుతుందని జనాభాకు అనుగుణంగా సీట్లు దక్కడం లేదని కొంతకాలంగా బీసీ వర్గాలు నిరసన వ్యక్తం చేస్తున్నాయి. కులగణన చేపట్టిన తర్వాతే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తు వస్తున్నాయి. ఈ మేరకు అసెంబ్లీ ఎన్నికల ప్రచారం సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకటించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన సర్వే చేపట్టింది. దీని ఆధారంగానే మళ్లీ రిజర్వేషన్‌లు ఖరారు చేసి ఎన్నికల్లోకి వెళ్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో ఏ గ్రామంలో ఏ రిజర్వేషన్ వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది.

535 జీపీలు.. 4,686 వార్డులు

జిల్లాలోని 535 గ్రామ పంచాయతీల పరిధిలో 4,686 వార్డుల్లో కలిపి మొత్తం 6,36,362 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషుల ఓట్లు 3,06,560 ఉండగా మహిళలవి 3,29,787 ఓట్లు, 15 మంది ఇతరుల ఓట్లు ఉన్నాయి. మొత్తం పోలింగ్ కేంద్రాలు 4,705 ఉండగా గ్రామాల్లో 650 ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. 200ల మంది ఓటర్లు ఉండే పోలింగ్ కేంద్రంలో ఒక ప్రిసైడింగ్, ఒక పోలింగ్ అధికారి ఉంటారు. 201 నుంచి 400 మంది ఓటర్లు ఉండే చోట ఒక ప్రిసైడింగ్, ఇద్దరు పోలింగ్ అధికారులు ఉండనున్నారు. 401-650 మంది ఓటర్లు ఉన్న దగ్గర ఒక ప్రిసైడింగ్, ముగ్గురు పోలింగ్ అధికారులు విధులు నిర్వహించనున్నారు.

మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు

గతంలో జిల్లాలో నిర్వహించిన పంచాయతీ ఎన్నికలను మూడు విడతల్లో చేపట్టారు. అదే మాదిరిగా ఈసారి కూడా పంచాయతీ ఎన్నికలను మూడు విడతల్లో నిర్వహించేందుకు సంబంధితశాఖ అధికారులు నివేదిక తయారు చేసి ఎన్నికల సంఘానికి నివేదించారు. మొదటి విడతలో కామారెడ్డి డివిజన్ పరిధిలోని 7 మండలాలైన కామారెడ్డి, భిక్కనూరు, దోమకొండ, బీబీపేట, మాచారెడ్డి, పాల్వంచ, రాజంపేట ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. రెండో విడతలో ఎల్లారెడ్డి డివిజన్ పరిధిలో ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట, లింగంపేట, తాడ్వాయి, రామారెడ్డి, నిజాంసాగర్, మహ్మద్‌నగర్, పిట్లం, గాంధారి, సదాశివనగర్. మూడో విడతలో బాన్సువాడ డివిజన్ పరిధిలోని బాన్సువాడ, బీర్కూర్, నస్రూల్లాబాద్, బిచ్కుంద, మద్నూర్, డోంగ్లీ, జుక్కల్, పెద్దకొడపగల్ మండలాల్లో ఎన్నికలు నిర్వహించే అవకాశాలు ఉన్నాయి.

పదవిని దక్కించుకునేందుకు ఆరాటం

పంచాయతీ ఎన్నికల్లో ఎన్ని డబ్బులు ఖర్చు అయినా ఈసారి సర్పంచ్ పదవిని దక్కించుకోవాలని వివిధ పార్టీల నాయకులు తహతహలాడుతున్నారు. ఏకగ్రీవం చేస్తే గ్రామ అభివృద్ధికి రూ. 20 నుంచి 50లక్షల వరకు ఇచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని పోటీ చేసే అభ్యర్థులు మేజర్ గ్రామ పంచాయతీల్లో ప్రచారాన్ని నిర్వహించుకుంటన్నారు. గతంలో బీసీ, జనరల్ స్థానాల్లో మాత్రమే ఎక్కువగా పోటీ ఉండి పదవిని దక్కించుకునేందుకు అధికంగా ఖర్చు చేసేవారు. ప్రస్తుతం బీసీ జనరల్‌తో పాటు ఎస్సీ, ఎస్టీ వర్గాలు సైతం తాము కూడా ఖర్చు పెట్టేందుకు తగ్గేది లేదని వారి సన్నిహితులతో చెబుతున్నారు. సర్పంచ్, ఉప సర్పంచ్ పదవుల పైనే నేతలంతా దృష్టి సారిస్తున్నారు.

ఘనంగా స్వామి వివేకానంద జయంతి

ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి



కామారెడ్డిలో వివేకానంద విగ్రహం వద్ద నివాళ్లు అర్పిస్తున్న ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి

కామారెడ్డి టౌన్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): జాతీయ యువజన దినోత్సవం పురస్కరించుకొని వివేకానంద జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద గల వివేకానందుడి విగ్రహానికి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి, తెలంగాణ యువజన, క్రీడలశాఖ ఆధ్వర్యంలో, హిందూవాహిని ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విశ్వవేదికపై భారతీయ సంస్కృతి, సంప్రదాయలను చాటిన స్ఫూర్తి ప్రధాత స్వామి వివేకానందుడని, యువతకు స్ఫూర్తిగా నిలవడమే కాకుండా భారతదేశ ఖ్యాతిని నలు దిశల వ్యాపింపజేసిన మహానుభావుడని అన్నారు. ఆయన చేసిన సేవలకుగాను జనవరి 12న జాతీయ యువజన దినోత్సవంగా జరుపుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మారెడ్డి, పట్టణ అధ్యక్షుడు భరత్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ శ్రీకాంత్, కౌన్సిలర్ నరేందర్, నాయకులు సంతోష్‌రెడ్డి, వేణు,రాజు, ప్రతాప్, హిందూవాహిని జిల్లా అధ్యక్షుడు సాయికిరణ్, టౌన్ సంయోజక్ మదన్, ప్రణయ్, రాజు, శ్రావణ్, శ్రీను, నర్సింలు, నవీన్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు పోచారం ఎందుకు ద్రోహం చేశారు?

- బాన్సువాడకు ఎక్కడా లేని నిధులను మంజూరు చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమే..
- పదేళ్లలో రూ.పది వేల కోట్లు మంజూరు చేశాం
- బాన్సువాడను బంగారు వాడగా మార్చింది బీఆర్ఎస్ పార్టీ
- బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



బాన్సువాడలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

బాన్సువాడ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కన్నతల్లి లాంటి బీఆర్ఎస్ పార్టీని వదిలి మాజీ స్పీకర్, ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఎందుకు ద్రోహం చేశారని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. ఆదివారం రాత్రి బాన్సువాడ నియోజకవర్గం విచ్చేసిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పట్టణంలోని కోయగుట్ట చౌరస్తాలోని అమరవీరుల స్థూపం వద్ద అమరులకు నివాళులర్పించారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ర్యాలీగా బాన్సువాడ పట్టణానికి ఘనస్వాగతం పలికారు. మహిళలు బోనాలు బతుకమ్మలతో కవితకు ఘన స్వాగతం పలికారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఎమ్మెల్సీ కవిత నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్సీ కవితకు గజమాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలో స్పీకర్‌గా ఉన్న నాయకులను తిరిగి ఎమ్మెల్యేగా గెలిపించిన ఘనత బాన్సువాడ ప్రజలదని ఆమె అన్నారు. బాన్సువాడ నియోజక వర్గం స్వతంత్ర భారతదేశంలో ఏ నియోజకవర్గానికి మంజూరు కానీ నిధులను కేవలం బాన్సువాడకు కేసీఆర్ నిధులు విడుదల చేశారని ఆమె తెలిపారు. 10ఏళ్లలో పదివేల కోట్లు అంటే సంవత్సరానికి వెయ్యి కోట్లు మంజూరు చేసిన ఘన త కేసీఆర్‌దేనని ఆమె తెలిపారు. అలాంటి మహో న్నత వ్యక్తిని బీఆర్ఎస్ పార్టీని వదిలి కాంగ్రెస్ పార్టీలోకి ఎందుకు వెళ్లారని ఆమె సూటిగా ప్రశ్నిం చారు. అంతేకాకుండా కాంగ్రెస్ పార్టీలోకి చేరి ఆరు నెలలు గడుస్తున్నా ఒక్క రూపాయి నిధులు కూడా తీసుకు రాలేదని కాంగ్రెస్ పార్టీలో ఉన్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి సంవత్సరానికి రూ.వెయ్యి కోట్లు తీసు కు వస్తారా అని ఆమె సవాల్ విసిరారు. ప్రజలకు ఏమి ఒరగనిది పోచారం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి ఎందుకు మారారని ఆమె అన్నారు. కేసీ ఆర్ గత 15 ఏళ్లలో 650కోట్లు మున్సిపల్ అభివృద్ధికి నిధులు మంజూరు చేశారని తిమ్మాపూర్ టీటీడీ ఆలయానికి 66 ఎకరాలు మంజూరు చేసి రూ.30 కోట్లు ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన ఘనత కేసీఆర్‌ది అని అన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో 30 వేల కేసీఆర్ కిట్లు మంజూరు చేశారని, ఆరు నెలల్లో ఒక కిట్టు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అందజేయలేదని ఆమె పేర్కొన్నారు. నియోజవర్గంలో నసురుల్లాబాద్, చందూర్, మోస్రా, రుద్రూర్, పొతంగల్ నూతన మండలాలను బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే జరిగిందన్నారు. 42 వేల మందికి ఆసరా పింఛన్లు 66వేల 670 మందికి రైతు బంధు, 14వేల మందికి రైతు బీమా, 7,500 మందికి గొర్రెల యూనిట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. నియోజవర్గంలో 250 చెరువులు ఉన్నాయని, ఉచిత చేప పిల్లలు పంపిణీ చేసిన ఘనత బీఆర్ఎస ప్రభుత్వందని కాంగ్రెస్ ప్రభుత్వంలో నామమాత్రంగా చేపలు విడుదల చేసి చేతులు దులుపుకున్నారని ఆమె ఆరోపించారు. నియోజకవర్గంలో రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా 11 వేల డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరు చేసిన ఘనత కేసీఆర్ దేనని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఉచిత బస్సు పథకం ప్రవేశపెట్టిన తర్వాత సంవత్సరానికి 12 వేలు మంజూరు చేస్తానని చెప్పి మోసం చేశారని కాంగ్రెస్ ప్రభుత్వం దేకేబాజీ ప్రభుత్వమని కోతల ప్రభుత్వమని ఆమె ఆరోపించారు. రైతులంటే కేసీఆర్‌కు పంచప్రాణాలని అలాంటి రైతులను పట్టించుకున్న పాపాన కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదన్నారు. నియోజవర్గంలో లిఫ్ట్ ఇరిగేషన్లు, చెక్ డ్యాంల ఏర్పాటుకు నిధులు మంజూరు చేయడం జరిగిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం జరిగినా తట్టమట్టి ఎత్తిన పాపాన పోలేదని ఆమె ఆరోపించారు. అంతేకాకుండా గురుకులాలు విద్యార్థులకు ఉన్నతమైన విద్యను నాణ్యమైన భోజనాన్ని అందించాల్సి ఉన్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వంలో పూర్తిగా విఫలమైందని ఆమె అన్నారు. అంతేకాకుండా బాన్సువాడను బంగారు వాడగా మార్చింది బీఆర్ఎస్ ప్రభుత్వం కేసీఆర్ అని ఇది ప్రజలు కార్యకర్తలు గుర్తుంచుకోవాలని ఆమె తెలిపారు. బంగారు కార్యకర్తలు ఉన్న వాడ బాన్సువాడ అని ఆమె పేర్కొన్నారు. నాయకులు పార్టీలో వస్తుంటారు వెళ్తుంటారు కానీ కార్యకర్తలు, ప్రజలే భరోసా పార్టీకి నాయకులని ఆమె తెలిపారు. చలి చీమల దండుగా కదులుదాం బాన్సువాడలో బీఆర్ఎస్ జెండా ఎగరవేద్దామని కార్యకర్తలకు ప్రజలకు ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జుబేర్, మాజీ ఎమ్మెల్యే నల్లమడుగు సురేందర్, దఫేదార్ రాజు, మాజీ జడ్పీటీసీ దాదన్నగారి విఠల్, సుమనారెడ్డి, విశాల్‌రెడ్డి, నాయకులు మోచి గణేష్, మహేష్, రమేష్ యాదవ్, సాయిబాబా, నర్సింహులు, సాయిలు తదితరులు ఉన్నారు.

ఇంటింటా సంక్రాంతి సందడి



- నేడు భోగి పండుగ
- ప్రతీ ఇంట్లో పిండి వంటల ఘుమఘుమలు
- గాలి పటాలతో చిన్నారుల బిజీబిజీ
- భగ్గుమంటున్న నిత్యావసరాల ధరలు

కామారెడ్డి టౌన్, జనవరి 12(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాల్లోని పల్లెలు, పట్టణాల్లో ఇంటింటా సంక్రాంతి సందడి మొదలైంది. విద్య, ఉద్యోగాల కోసం పట్టణాలకు వలస వెళ్లిన వారంతా తమ గ్రామాలు, పట్టణాలకు వస్తున్నారు. భోగి, సంక్రాంతి, కనుమ పండుగలు నేటి నుంచి ప్రారంభం కానుండడం, విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించడంతో పిల్లలు, యువతి,యువకుల్లో జోష్ కనిపిస్తోంది. చిన్నాపెద్ద తేడా లేకుండా అందరూ పతంగులను ఎగురవేస్తు సందడి చేయనున్నారు. సోమవారం భోగి మంటలు వేసి ఆయా ప్రాంతాల్లో సందడి వాతావరణం నెలకొలిపేందుకు సిద్ధం అవుతున్నారు. ఇదిలా ఉంటే ప్రతీ ఇంట్లో పిండి వంటల తయారీ జోరుగా సాగుతుండగా నిత్యావసర ధరలు భగ్గుమంటున్నాయి. కొద్దిమేర నిరాశతో ఉన్నా పండుగను ఘనంగా జరుపుకునేందుకు ప్రజలందరూ సిద్ధమవుతున్నారు.

జోరుగా పిండి వంటల తయారీ

కొత్త సంవత్సరం తర్వాత తొలి పండుగ అయిన సంక్రాంతి రైతులు, పాడి పంటలతో ముడిపడి ఉండడంతో అన్ని వర్గాల ప్రజలు ఆసక్తి ఎక్కువగా ఉంటుంది. సంక్రాంతికి కొత్త పంటలు చేతికి రావడంతో పిండి వంటలకు అధిక ప్రాధాన్యం ఉంటుంది. ఈ పండుగకు ప్రత్యేకంగా తయారు చేసే సకినాలు, చెగోడీలు, అప్పాలు, మురుకులు, గర్జలు నోరూరిస్తాయి. సాధారణ రోజుల్లో తినుబండరాలను దుకాణాల్లో కొనుగోలు చేసే ప్రజలు సంక్రాంతికి మాత్రం సంప్రదాయబద్ధంగా తమ ఇళ్లలోనే పిండి వంటలు తయారు చేసుకునేందుకు ఇష్టపడుతారు. ఆదివారం జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పక్కింటి,బంధుమిత్రులతో కలిసి ఇంటి పరిసరాల్లో పిండివంటలు తయారు చేస్తూ ప్రజలు నిమగ్నమయ్యారు.

భగ్గుమంటున్న నిత్యావసర ధరలు

నిత్యావసర వస్తువుల ధరలు అందుబాటులో లేకుండా ఆకాశాన్ని అంటుతుండడంతో మధ్యతరగతి, పేద ప్రజలు జంకుతున్నారు. నువ్వులు, బెల్లం, మంచినూనె, కూరగాయలు తదితర వస్తువుల ధరలకు రెక్కలు వచ్చాయి. జిల్లాలో సాధారణంగా నెలకు 10 నుంచి 15 లక్షల లీటర్ల నూనె అమ్మకాలు జరుగుతుంటాయి. పండుగల సమయంలో వీటి అమ్మకాలు మరింత ఎక్కువగా ఉంటాయి. సాధారణ రోజుల్లో కంటే పండుగ రోజుల్లో అదనంగా మరో 4 లక్షల లీటర్ల నూనె ఎక్కువగా అమ్మడు జరుగుతాయి. మార్కెట్లో కిలో పల్లినూనె రూ.150, సన్‌ఫ్లవర్ నూనె రూ.140, పామాయిల్ కిలోకు రూ.95 నుంచి రూ.120 వరకు విక్రయిస్తున్నారు. ఇక కూరగాయల ధరలకు పరిశీలిస్తే చిక్కుడు, బెండకాయ కిలోకు రూ.100కు చేరుకోగా, దొండకాయ రూ.80, ఎల్లిగడ్డ రూ.300, ఎండుమిర్చి రూ.170, కంది పప్పు కిలోకు రూ.150, మార్కెట్లో బెల్లం అమ్మకాలు చేస్తున్న దుకాణాలలో ధరలు సైతం ఆకాశాన్నంటాయి. ఆయా చోట్ల బెల్లం తయారు చేస్తున్న వారి వద్ద కొనుగోలు చేస్తున్నప్పటికీ ధరలు ఎక్కువగానే ఉంటున్నాయి. పండుగ పూట నోముల్లో బెల్లంతో చేసిన నువ్వుల లడ్డూలు, అరిసెలు, బూరెలు తదితర వంటకాలను తయారు చేయడం ఆనవాయితీ. సంక్రాంతి పండుగకు వివిధ పూజలు, వ్రతాలకు నువ్వులు ఎక్కువగా వాడతారు. ఎక్కువగా సకినాల్లో, నువ్వుల లడ్డూలకు, నువ్వుల బూరెలకు పండుగ రోజున నువ్వుల చక్కెర ప్రసాదాలు తదితర వాటికి ఎక్కువగా వినియోగిస్తారు. వీటి ధరలు సైతం అమాంతంగా పెరిగాయి. ఏది ఏమైన సంక్రాంతి పండుగను సందడిగా చేసుకునేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారు.




మాట్లాడుతున్న ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి

బంగారు గొలుసు దొంగల అరెస్టు

ఆర్మూర్‌టౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో ఇద్దరు బంగారు గొలుసు దొంగల అరెస్టు చేసినట్లు ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమా వేశంలో ఆయన మాట్లాడుతూ కొద్ది రోజులుగా యాక్టివ స్కూటిపై వచ్చి ఒంటరిగా వెళ్తున్న మహిళల మెడలో నుంచి బంగారు గొలుసును ఎత్తుకెళ్తున్నారని పలువురు ఫిర్యాదు మేరకు ఏసీపీ ఆధ్వర్యంలో టీంలుగా ఏర్పాటు చేసిన ఓ బాలుడితో పాటు బట్టు బాల్‌రాజ్ అనే యువకుడిని పట్టుకొని విచారించగా పట్టణంలోని రాంనగర్‌లో ఉన్న గంగాధర్‌కు దొంగ బంగారాన్ని అమ్మి వచ్చిన డబ్బులతో జల్సాలకు పాల్పడుతున్నారని తేలింది. దీంతో వారి వద్ద నుంచి 20గ్రాముల పుస్తెలతాడు, 25 గ్రా ముల చైన్, 30గ్రాముల మరోక చైన్‌తో పాటు హోండా యాక్టివ స్కూటీని స్వాధీనం చేసుకొని ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపనున్నట్లు ఆయన తెలిపారు. కేసును ఛేదించిన ఎస్‌హెచ్‌వో సత్యనారా యణ, ఎస్సైలు గోవింద్, మహేష్, ఐడీ పార్టీ హెడ్‌కానిస్టేబుల్ తిరుపతి, కానిస్టేబుళ్లు ఆనంద్, హరిష్, అశోక్, శీను, సురేందర్‌లు ఏసీపీ అభినందించి రివార్డులు అందజేశారు.

చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య

బోధన్‌రూరల్,జనవరి12(ఆంధ్రజ్యోతి): బోధన్ మండలంలోని ఖండ్‌గావ్ గ్రామానికి చెందిన మాధవరావు పటేల్(56)అనే వ్యక్తి గ్రామ శివారులో గల మంజీర నదిలో ఆదివారం తెల్లవారుజామున దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు బోధన్ రూరల్ ఎస్‌ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు, ఇతరత్రా కారణాల వల్ల ఆత్మహత్య చేసుకున్నట్లు తమ ఫిర్యాదులో అందిందన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అన్ని కోణాల్లో విచారణ చేపట్టి దర్యాప్తు జరుపుతున్నామన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించామన్నారు.

పెద్దవాగులో పడి వ్యక్తి మృతి

మోర్తాడ్; జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలెం గ్రామానికి చెందిన మల్లారి రాజన్న(59) అనే వ్యక్తి పెద్ద వాగులో కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు వాగులో పడి చనిపోయాడని ఎస్సై విక్రం తెలిపారు. మృతుని చెల్లెలు సుంకరి లింగుబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

అమ్మవారి ఆలయంలో హుండీ చోరీ

బోధన్‌రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజీవ్‌నగర్ తండా గ్రామంలో గల జగదాంబ అమ్మవారి ఆలయంలో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు హుండి పగుల గొట్టి అందులో ఉన్న డబ్బులు దొంగలించారని బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి తెలిపారు. ఆలయ కమిటీ నిర్వాహకులు, గ్రామ పెద్దల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేపడుతున్నామన్నారు. గ్రామంలో సీసీ పుటేజీల ద్వారా త్వరలోనే దొంగలను పట్టుకుంటామన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

బోధన్‌రూరల్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆదివారం అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న టిప్పర్‌ను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించామని బోధన్ పట్టణ ఇన్‌చార్జి సీఐ విజయ్ బాబు తెలిపారు. మంజీర సరిహద్దు ప్రాంతాల నుండి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న టిప్పర్‌ను పట్టుకోవడం జరిగిందన్నారు. ఇసుకను అక్రమ రవాణా చేస్తున్న టిప్పర్‌పై కేసు నమోదు చేశామన్నారు. అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనల మేరకే ఉదయం వేళలలో మాత్రమే ఇసుక రవాణా చేయాలన్నారు.

విజ్ఞాన, విహార యాత్రకు వెళ్లిన కుకునూర్ విద్యార్థులు

వేల్పూర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సెలవులలో భాగంగా వేల్పూర్ మండలం కుకునూర్ గ్రామ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు విజ్ఞాన విహార యాత్రకు వెళ్లారు. విద్యార్థుల తల్లిదండ్రులు, అమ్మ ఆదర్శ పాఠశాల గ్రామాభివృద్ధి కమిటీ సహకారంతో విజ్ఞాన విహార యాత్రకు వెళ్లారు. రామప్ప, వెయ్యి స్థంభాల గురించి, భద్రచలం, ద్వారక తిరుమల, అన్నవరం, సింహాచలం, అరకు, బొర్ర కేవ్స్ కైలాసగిరి, వైజాగ్ సిటీ, విజయవాడ తదితర ప్రాంతాలను సందర్శించనున్నారు. విద్యా ర్థుల వెంట పలువురు ఉపాధ్యాయులు వెళ్లారు.

కమ్మర్‌పల్లిలో సర్వే సిబ్బందికి అవగాహన

కమ్మర్‌పల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు జరపనున్న వివిధ సంక్షేమ పథకాల లబ్ధిదారుల గుర్తింపు కార్యక్రమంలో చేపట్టాల్సిన నిబంధనలపై ఆదివారం కమ్మర్‌పల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సర్వే సిబ్బందికి ఎంపీడీవో రాజా శ్రీనివాస్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, నూతన రేషన్ కార్డుల జారి, ఇందిరమ్మ ఇండ్లు, రైతుభరోసా తదితర పథకాల లబ్దిదారుల ఎంపిక బృందాలద్వార వెరిఫికేషన్, గ్రామసభల్లో ఆమోదం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో విద్యానంద్, మండల పంచాయితీ కార్యదర్శులు, ఈజీఎస్ ఫీల్డ్ అసిసెంట్‌లు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌కు సన్మానం

ఆర్మూర్‌రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇస్సాపల్లి గ్రామంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఇటీవల ఆర్మూర్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్‌గా ఎన్నికైన ఇట్టెం జీవన్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘ సభ్యులు బండి శ్రీహరి, వన్నెల్‌దాస్ శ్రీనివాస్, కృష్ణయ్య, ప్రకాష్, గణేష్, డాక్టర్ ప్రభాకర్, రమణయ్య, జ్ఞానేశ్వర్, మహేష్, డాక్టర్ శ్రీనివాస్, పద్మశాలి సంఘ సభ్యులు పాల్గొన్నారు.

శావులం సాయిలు ఆశయ సాధనకు కృషి చేద్దాం

ఆర్మూర్‌టౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కుమార్‌నారాయణ భవన్‌లో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ఆధ్వర్యంలో ఆదివారం శావులం సాయిలు 29వ వర్ధంతి సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర సెక్రెటరీ వి.ప్రభాకర్ మాట్లాడుతూ కామ్రెడ్ శావులం సాయిలు స్పూర్తితో విప్లవ ఉద్యమాలు నిర్మిద్దామని ప్రజాపంథా మాదిరిగానే అజయమేనన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎంఎల్ మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి బి.దేవరాం, డి.కృష్ణ, రామకృష్ణ, కె.గంగాధర్, జి.కిషన్, రాజేశ్వర్, దామోదర్ పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

బోధన్‌రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఆరోగ్యం ముఖ్యమని, ఆరోగ్య సంరక్షణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మ శరత్ రెడ్డి అన్నారు. ఆదివారం బోధన్ పట్టణంలోని ఆరోగ్య జ్యోతి చారిటబుల్ ట్రస్టు, వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత డయాబెటిక్, షుగర్, బీపీ పరీక్షలను నిర్వహించారు.


బోధన్‌లో వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం


బోధన్‌లో మెగా వైద్య శిబిరం దృశ్యం


జాన్కంపేట్‌లో..


వివేకానందకు నివాళులు అర్పిస్తున్న యువకులు

యువతకు ఆదర్శం.. వివేకానంద

బోధన్‌రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): నేటి యువత స్వామి వివేకానంద అడుగు జాడల్లో నడవాలని ఆర్‌ఎస్‌ఎస్ వక్త దేవోళ్ల శంకర్‌జీ అన్నారు. యువతకు స్పూర్తి ప్రదాతకు, దేశ ఔన్నత్యాన్ని విశ్వవ్యాప్తం చేసిన చైతన్యమూర్తి స్వామి వివేకానంద అని ఆయన పేర్కొన్నారు. ఆదివారం బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. స్వామి వివేకానంద జయంతి, హిందు వాహిని ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మెగా హెల్త్‌క్యాంప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంకు మహేష్, దామోదర్, హిందూ వాహిని జిల్లా సహయ కన్వీనర్ పులి సాయిలు, ప్రచార ప్రముఖ్ సురేష్ పటేల్, హిందు వాహిని నాయకులు అయ్యప్ప, ఒడ్డెన్న, శివ, బాలు, శ్రావణ్, నవీన్ రాజ్, అంకు దాము, మహేష్, ఏబీవీపీ నాయకులు తలాండే ఈశ్వర్, లక్ష్మణ్ చౌహాన్, అడ్లూరి శ్రీరామ్, ప్రవీణ్ మహరాజ్, వీహెచ్‌పీ నాయకులు సురేష్ ఇనాని, బీజేపీ పట్టణ అధ్యక్షుడు బాలరాజు, సీనియర్ నాయకులు నర్సింహ రెడ్డి, సుధాకర్ చారి, వాసు, గోపి, అరవింద్, కిషన్, జల్లా సతీష్, అరవింద్ రెడ్డి, సన్‌రైజ్ హస్పటల్ ల్యాబ్ కోఆర్డినేటర్ సంతోష్, ఆసుపత్రి సిబ్బంది, హిందు వాహిని కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రుద్రూర్: యువతకు స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానంద అని బీజేపీ మండల అధ్యక్షుడు ఆలంపాటి హరికృష్ణ అన్నారు. ఆదివారం రుద్రూర్ మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయం వద్ద బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి జయంతి వేడుకలను ఘనంగా జరుపు కున్నారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు ఆలంపాటి హరికృష్ణ మాట్లాడుతూ యువత స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకుని ఆయన అడుగుజాడల్లో నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎముల గజేందర్, వడ్ల సాయినాథ్, కుమ్మరి గణేష్, సతీష్ పవర్, పార్వతి మురళి, ప్రశాంత్ గౌడ్, అనీల్, శివ ప్రసాద్, సాయికుమార్, బేగరి వినోద్, మండల సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేల్పూర్: మండలంలోని జాన్కంపేట్ గ్రామంలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని ఆదివారం హిందు యువసేన ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి వందనం చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు శంకర్ గౌడ్ మాట్లాడుతూ భారతదేశ ఔనత్యాన్ని, సాంస్కృతి విశిష్టతను విశ్వవ్యాప్తం చేసిన మహనీయుడు, యువతకు స్పూర్తి ప్రధాత స్వామివివేకానంద అని కొనియాడారు ఈ సందర్భంగా ఛత్రపతి యువసేన సభ్యులు హన్మాన్ మందిరంలో కలుపు మొక్కలను తొలగించి గుడి ఆవరణాన్ని శుభ్రం చేశారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని హుస్నాబాద్‌గల్లీలో యువకులు ఘనంగా యువజన దినోత్సవాన్ని జరుపు కున్నారు. ఈ సందర్భంగా బీజేపీ అధికార ప్రతినిధి స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వామి వివేకానంద జన్మదినాన్ని జాతీయ యువజన దినోత్సవంగా జరుపుకుంటున్నామని, మన దేశ ఔనత్యాన్ని, సంస్కృతిని ప్రపంచానికి చాటి చెప్పిన మేధావి అని అన్నారు. ఈ కార్యక్రమంలో కలిగోట ప్రమోద్, దినేష్‌చంద్ర, మనిష్, హనిష్, మణిచంద్ర, రుషికేష్, తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్: బాల్కొండ మండలం నాగాపూర్ గ్రామంలో ప్రధానకూడలి వద్ద ఆదివారం స్వామివివేకానంద వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నారాయణ, శివ, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌రూరల్: మండలంలోని వివిధ గ్రామాల్లో స్వామి వివేకానంద జయంతిని నిర్వహిం చారు. బీజేపీ ఆర్మూర్ మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఇస్సాపల్లిలో స్వామివివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి జెస్సు అనిల్ మాట్లాడుతూ నేటి యువతరం స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ స ర్పంచ్ ముత్యంరెడ్డి, బీజేపీ నాయకులు పులి యుగంధర్, ఉదయ్‌గౌడ్, మిర్యాల్‌కర్ కిరణ్, గిరిజన మోర్చ పట్టణ అధ్యక్షుడు వీర్‌సింగ్‌నాయక్, భానుచందర్ పాల్గొన్నారు.

కోటగిరి: పొతంగల్ మండల కేంద్రంలోని బాలాజీ మందిరంలో ఆదివారం స్వామి వివేకానంద జయంతి వేడుకలను వివేకానంద యూత్ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జయంతిని పురస్కరించుకుని సంక్రాంతి వేడుకలలో భాగంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్వామి వివేకానంద యూత్ సభ్యులు మోహన్, దత్తు, దశరథ్ పాల్గొన్నారు.

రుద్రూర్: మండల కేంద్రంలో గల ఆహార శాస్త్ర, సాంకేతిక కళాశాలలో ఆదివారం ఘనంగా స్వామి వివేకానంద జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఎడపల్లి: మండలంలో ఆదివారం స్వామి వివేకానంద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాలలోని వివేకానంద విగ్రహాలకు హిందూవాహిని ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపి నాయకులు కందగట్ల రాంచందర్, మల్లెపూల శ్రీనివాస్, శివచైతన్య, సాయి, గంగాప్రసాద్, లక్ష్మణ్‌గౌడ్, ద్యాకం సాయిలు, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

కోటగిరి: పొతంగల్ మండల కేంద్రంలోని బాలాజీ మందిరంలో ఆదివారం స్వామి వివేకానంద జయంతి వేడుకలను వివేకానంద యూత్ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జయంతిని పురస్కరించుకుని సంక్రాంతి వేడుకలలో భాగంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్వామి వివేకానంద యూత్ సభ్యులు మోహన్, దత్తు, దశరథ్ పాల్గొన్నారు.

నవీపేట: మండల కేంద్రంలో ఆదివారం స్వామి వివేకానంద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ సమీపంలో ఉన్న వివేకానంద విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీనివాస్ గౌడ్, రాజేందర్ గౌడ్, గణేష్, రాజశేఖర్, ప్రవీణ్ కుమార్, రాము, గంగాధర్ తదితరులున్నారు.

● **వివేకానంద యూత్ ఆధ్వర్యంలో..**

స్వామి వివేకానంద యూత్ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో స్వామి వివేకానంద 163వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివేకానంద యూత్ నాయకులు రాకేష్, వెంకట్, సాయి తేజ, నవీన్, సంగం తదితరులున్నారు.

జక్రాన్‌పల్లి: మండలంలో ఆదివారం స్వామివివేకానంద జయంతిని నాయకులు ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని బ్రహ్మణ్‌పల్లి గ్రామంలో స్వామివివేకానంద విగ్రహానికి మాజీసర్పంచ్ భూమిక శేఖర్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం స్వీట్లు పంచు కున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నవీన్ నిఖిల్, సతీష్, బాలు, శివపాల్, శ్రీనివాస్, సాగర్, రంజిత్, స్వామి వివేకానంద యూత్ సభ్యులు పాల్గొన్నారు.

మెండోర: వివేకానందుడి జీవితం యువతకు ఆదర్శనీయమని గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు అన్నారు. శనివారం స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలో స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి జయంతి ఉత్సవ వేడకలను ఘనంగా నిర్వహించారు.

ఎంపీ ప్రియాంక గాంధీ జన్మదిన వేడుకలు

జక్రాన్‌పల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో ఆదివారం ఎంపీ ప్రియాంకగాంధీ జన్మదిన వేడుకలను మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సొప్పారి వినోద్, మాజీసర్పంచ్ కాట్‌పల్లి నర్సా రెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ జితేందర్ నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అక్బర్, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

మోస్రా, జనవరి 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో వివేకానంద జయంతి సందర్భంగా ఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ మోస్రా ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 25మంది రక్తదాతలు రక్తం దానం చేశారు. రక్తదానం చేసిన వ్యక్తులకు పండ్ల రసం, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు త్రినాథ్ గౌడ్, ఇందూర్ రెడ్‌క్రాస్ సిబ్బంది, మోస్రా గ్రామ యువకులు, విశ్వహిందు సభ్యులు పాల్గొన్నారు.

రక్తదానం ..మహా దానం

బోధన్‌రూరల్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): రక్తదానం ఆదపలో ఉన్న వారి ప్రాణాలను కాపాడుతుందని తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య జిల్లా ప్రధాన కార్యదర్శి దయానంద్ గోశాల ప్రధాన్ చిద్ర ప్రదీప్‌గుప్తా అన్నారు. ఆదివారం శ్రీ జగద్గురు నరేంద్ర చార్య మహరాజ్ సంస్థ తరఫున బోధన్ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో మహ యజ్ఞం పేరుతో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అనేక మంది యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడం అభినందనీయమని, రక్తదానం ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జగద్గురు సంస్థానానికి చెందిన సుష్మిత, మనోజ్, సురేష్, సాయి కిరణ్, రూరల్ సీఐ విజయ్ బాబు, ఏఎస్‌ఐ గంగాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను మరిచిపోవద్దు

బోధన్‌రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మహిళలు తమ సంస్కృతి, సంప్రదాయాలను మరిచిపోవద్దని లయన్స్ తాజా, మాజీ గవర్నర్ వేమూరి లక్ష్మి అన్నారు. ఆదివారం బోధన్ పట్టణంలోని గౌడ్స్ కాలనీలో సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. రాకాసిపేట్‌లోని గౌడ్స్ కాలనీలో భజరంగ్ దళ్ గణేష్ మండలి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులతో పాటు లయన్స్ శ్యామ్‌సుందర్ పహాడే, గౌడ్స్ కాలనీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం

భీమ్‌గల్ జనవరి12(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో మైనారిటీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తుందని మాజీజడ్పీ కోఆప్షన్‌మెంబర్ మోయిజ్ ఆదివారం ఒక ప్రకటనలో అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మైనారిటీ సంక్షేమానికి బడ్జెట్‌లో రూ.4వేల కోట్లకు పెంచుతామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత 2024-25 నాటికి రూ.3వేల కోట్లు మాత్రమే కేటాయించి వాటిలో ఇప్పటి వరకు రూ.750కోట్ల లోపే ఖర్చు చేసి మైనారిటీలపై ఉన్న కపట ప్రేమను నిరుపించుకుందన్నారు. ఇప్పటికైనా మైనారిటీ సబ్‌ప్లాన్ అమలుచేయాలని కోరారు.

తెలుగుదేశం పార్టీలో రిటైర్డ్ ఎంఈవో చేరిక

బోధన్‌రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలలో తెలుగు దేశం పార్టీ ప్రభంజనం చాటి స్థానాలు కైవసం చేసుకుంటుందని తెలుగు దేశం పార్టీ బోధన్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట గోపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం బోధన్ పట్టణంలో తెలుగు దేశం పార్టీలో విశ్రాంత మండల విద్యాశాఖ అధికారి బాలగంగాధర్ స్వచ్ఛందంగా తెలుగు దేశం పార్టీలో చేరడంతో ఆయనకు పార్టీ కండువా వేసి తెలుగు దేశం పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ ఇన్‌చార్జి దేగాం యాదాగౌడ్, సీనియర్ నాయకులు హన్మంత్ రావు, పావులూరి వెంకటేశ్వర్ రావు, నరసింహ రావు, రమేష్, సాయిబాబా, రావెళ్ల శ్రీనివాస్, భాస్కర్ పాల్గొన్నారు.

బొర్రా హన్మాన్ యూత్ కార్యవర్గం ఇదే..

భీమ్‌గల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బోదిరే గల్లి బోర్ర హన్మన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. అధ్యక్షుడిగా నీలం రవి, ఉపాధ్యక్షుడిగా రావుల హరిష్, కోశాధికారిగా బోది రె అరుణ్‌లను యూత్ సభ్యుల సమక్షంలో ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో తరుణ్; చరణ్, బిసుమన్, గంగం నరేష్, గంగరపు రఘు, తిరుపతి, నరేష్, గంగరపు చరణ్, రమేష్, పప్పుల రాము, శ్రీకాంత్, చాగంటి వంశీ, కోటారి రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

పడిగెలలో శాఖాహార ర్యాలీ


పడిగెలలో మానవహారం నిర్వహిస్తున్న దృశ్యం

వేల్పూర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం పడిగెల గ్రామంలో పీఎస్‌ఎస్ఎం నవనాథపురం పడిగెల ఆధ్వర్యంలో ఆదివారం శాఖాహార ర్యాలీ నిర్వహించారు. ఆనంద ఆదివారం కార్యక్రమంలో భాగంగా ధ్యానం, జ్ఞానం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అంతకు ముందు గ్రామంలోని ప్రధాన వీధులగుండా ర్యాలీ నిర్వహించి గాంధీ విగ్రహం వద్ద మానవహారం నిర్వహించారు. దేవతల పేరుతో జంతు బలి మహా పాపం, ప్రతీ జీవిలోను భగవంతుడు ఉంటాడు, ఏ జీవిని చంపే హక్కు ఎవరికి లేదు, శాఖహారం తినండి ఆరోగ్యంగా జీవించండి, ధ్యానమే వైభోగము, సంపూర్ణ ఆరోగ్యమే ప్రగతికి సోపనం, ముక్తికి మార్గం శాఖాహారం వంటి నినాదాలను చేశారు. ఈ సందర్భంగా పీఎస్ఎస్ఎం జిల్లా అధ్యక్షుడు సాయికృష్ణరెడ్డి, మహేశ్వర మహాపిరమిడ్ ట్రస్ట్ సలహాదారులు కె.సుధీర్‌రెడ్డిలు మాట్లాడుతూ అందరు ధ్యానం చేయాలని, శాఖాహారులుగా మారాలని బోధించారు. ధ్యాన, జ్ఞాన కార్యక్రమాలు ప్రమీల నిర్మాణాలు ఎంతో అద్భుతంగా నిర్వహిస్తున్నామన్నారు. మానవులందరూ ఆనందంగా, ఐశ్వర్యంగా ఉం డాలంటే ప్రతీరోజూ ధ్యానం చేయాలని, శాఖహారం భుజించాలని దాని వల్ల పిరమిడ్ శక్తిని ఉపయోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు శృతి, గాయత్రి, హాసిని, రాజ్‌వర్షిణి, వైష్ణవిలు చేసిన భరతనాట్య ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో తెలంగాణ జానపద భూపతిరాజ్, తిరుమల గంగారాం, బావయ్య, ఆర్డీవో బావయ్య, సీనియర్ పిరమిడ్ మాస్టర్‌లు బొడ్డు దయానంద్, సుకల లక్ష్మణ్, మామిడి లక్ష్మారెడ్డి, ఇందూరు ధ్యాన గద్దర్ డాక్టర్ అమరవాజి శ్రీనివాస్, రాగి ప్రభాకర్, మల్లయ్య, బాల సాయన్న, మహిళలు, తదితరులు ఉన్నారు.

అ'పూర్వ'ం విద్యార్థుల సమ్మేళనం


పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కమ్మర్‌పల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 2002- 2003 విద్యాసంవత్సరం పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం పీవీఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా 22 సంవత్సరాల తరువాత పూర్వవిద్యార్థులందరూ ఒకేచోట చేరుకుని పాత జ్ఞాపకాలను పంచుకున్నారు. తమకు విద్యా బుద్దులు నేర్పిన రుక్మయ్య, దామోదర్ గౌడ్, బక్కూరి రాజేశ్వర్, గోపిగౌడ్ గురువులును ఘనంగా సన్మానించారు. మరణించిన ఉపాధ్యాయులు పురుశోత్తమ శర్మ, జాకబ్, చంద్రమౌళి, సాయన్న, లక్ష్మీనర్సయ్య, సురేష్ బాబు, సాటివిద్యార్థులు చింత హరీష్, కోత్వాల్ దశరథ్ ప్రసాద్ గంగాధర్‌ను గుర్తు చేసుకుంటూ వారికి ఘనంగా నివాళ్లర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు పార్శపు జైపాల్ రెడ్డి, గోపిడి మహేష్, మామిడాల నరేష్, కౌడ లక్ష్మణ్, సుమన్, కొత్తపల్లి సాగర్, యామ శ్రీనివాస్, తిరుపతి, రాజేష్, వంగరి రవి, సత్యకిషోర్, సతీష్, తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం చేస్తాం

మెండోర, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ ఆశయాల సాధన లో భాగంగానే ఎస్సీవర్గీకరణ కోసం పోరాటం చేస్తున్నామని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కనక ప్రమోద్ మాదిగ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఫిబ్రవరి 7వ తేదీన హైదరాబాద్‌లో జరిగే వెయ్యి గొంతులు, లక్ష డప్పుల ప్రదర్శనకు మద్దతుగా ఎమ్మార్పీఎస్ ఆధ్వ ర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మా ట్లాడుతూ ఎస్సీవర్గీకరణ జరిగితే ఏ కులానికి అన్యాయం జరగ దని జనాభా ప్రతి పాదికన ఎస్సీలలో ఉన్న అన్ని కులాలకు రిజర్వేషన్‌లు లభించి న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతీ అడ్డంకులకు ఎదుర్కొవడానికి వెయ్యి గొంతులు లక్ష డప్పుల మహా సాంస్కృతిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల జేఏసీ అధ్యక్షుడు సావెల్ గంగాధర్, కమలాకర్, సురేష్, గణేష్, మహేష్, రాజేష్, సాయన్న, నిశంత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విరాళాలు సేకరించి ఆర్థికసాయం

కోటగిరి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండల కేంద్రంలో ఓ బాధిత కుటుంబానికి ఆదివారం రూ.21వేల ఆర్థికసాయం అందజేశారు. గ్రామానికి చెందిన వేణుబాయి అనే మహిళ ఇటీవల మృతి చెందింది. వారి కుటుంబం ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో సామాజిక కార్యకర్త సీతాలే రమేష్ ఆ కుటుంబానికి అండగా ఉండేందుకు సోషల్ మీడియా ద్వారా దాతల సహకారం కోరారు. దాతలు స్పందించి రూ.21వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ మొత్తాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నవీన్, సాయిలు, విఠల్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పసిపాపకు ఆపరేషన్ కోసం..

ముప్కాల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన వినయ్, నిషేధిత దంపతుల రెండు నెలల పసిపాపకు బోన్ మ్యారో ట్రాన్స్ ప్లాంట్ ఆపరేషన్ అపన్నహస్తం కోసం వేడుకుంటున్న వారికి మాజీ జడ్పీటీసీ బద్దం నర్సవ్వ నర్సారెడ్డిలు రూ.5వేల ఆర్థికసాయం కుటుంబ సభ్యులకు అందజేశారు. పాప త్వరగా కొలుకోవాలని వారు ఆకాంక్షించారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస పూజలు

జక్రాన్‌పల్లి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రహ్మణ్‌పల్లి గ్రామంలో ధనుర్మాసం సందర్భంగా శ్రీ బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు, గ్రామస్థులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం యజ్ఞం నిర్వహించారు. మంగళస్నానం, అభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీసర్పంచ్ భూమిక శేఖర్, పందులు సుదర్శనచారి, నాయకులు ప్రకాష్, రమేష్, గంగామోహన్, రాజేష్, వినోద్ పాల్గొన్నారు.

'అబాకస్ మేథోశక్తిని పెంపొందిస్తుంది'

డొంకేశ్వర్ జనవరి 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో మేథోశక్తిని పెంపొందించేందుకు అబాకస్ దోహదపడుతుందని ఎస్ఎస్‌వి పాఠశాల కరస్పాండెంట్ చిరంజీవి, ప్రిన్సిపాల్ స్వామి అన్నారు. డొంకేశ్వర్ మండలం తొండాకూర్‌లోని ఎస్ఎస్‌వి పాఠశాల విద్యార్థులు నిజామా బాద్‌లో జరిగిన జోనల్ లెవెల్ అబాకస్ పోటీల్లో ఎస్ఎస్‌వి పాఠశాల విద్యార్థులు పాల్గొనగా అందులో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థుల ను సన్మానించారు. విద్యార్థి దశ నుంచే విద్యార్థులు గణితం వల్ల అవ గాహన పెంచుకోవడం వల్ల గణితంపై పట్టు సాధించవచ్చని అన్నారు. విద్యార్థులు జోనల్ లెవల్‌లో ప్రతిభ కనబర్చడంతో అబాకస్ ఉపాధ్యా యులు గంగలత, లక్ష్మీ, మౌనిక, సుప్రియలను అభినందించారు.

జిల్లా ఆసుపత్రి సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

బోధన్‌రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ మరో వైపు సూపరింటెండెంట్ జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న విషయంపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని టీయూసీఐ జిల్లా కార్యదర్శి మల్లేష్, పీవోడబ్ల్యూ మహిళ అధ్యక్షురాలు నాగమణి డిమాండ్ చేశారు. ఆదివారం బోధన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో లక్ష్మి అనే మహిళను చికిత్స నిమిత్తం ఆమె భర్త రెడ్యానాయక్ జిల్లా ఆసుపత్రికి శనివారం తీసుకువచ్చారన్నారు. రోగి ఫిట్స్‌తో బాధపడుతూ కదలలేని స్థితిలో ఉందని ఆసుపత్రి సిబ్బందిని వేడుకోగా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో భర్త తన భుజాలపై ఆసుపత్రిలోకి తీసుకువెళ్లారు. డాక్టర్ వైద్యం చేయకుండానే సీటి స్కాన్ చేసుకోవాలని పంపించడం సరికాదన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ జన్మదిన వేడుకలలో సిబ్బంది మునిగి తేలడం ఆసుపత్రికి వచ్చే రోగులను పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పడాల శంకర్, సీతారాం, తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: పలు మండలాలతో పాటు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య సిబ్బంది రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా ఉన్నత అధికారులు పట్టనట్లు వ్యవహరించడం తగదని విచారణ రరిపించి వారిపై తగు చర్యలు తీసుకోవాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా నాయకులు సారా సురేష్ డిమాండ్ చేశారు. సిబ్బంది వ్యవహర తీరు సభ్యసమాజం తలదించుకునే మాదిరి ఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైద్య సిబ్బందిపై విచారణ జరిపించి తగు రర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ మండల కార్యదర్శి బి అశోక్ పాల్గొన్నారు.

మందిర నిర్మాణానికి విరాళం

ఎడపల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుర్నాపల్లి గ్రామంలో నూతనంగా నిర్మాణం చేపట్టిన శ్రీ లక్ష్మి నర్సింహస్వామి మందిర నిర్మాణానికి బీజేపీ సీనియర్ నాయకుడు కందగట్ల రాంచందర్ 20,001 రూపాయలను ఆదివారం విరాళాన్ని అందజేశారు.

మార్కెట్‌కు సంక్రాంతి శోభ



రేవపండ్లు



రంగులు కొనుగోలు చేస్తున్న మహిళలు



పూజా సామగ్రి కొనుగోలు చేస్తూ..

నిజామాబాద్ కల్చరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వ దినం పురస్కరించుకొని మార్కెట్ సందడిగా మారింది. సంక్రాంతి పండుగలో ప్రత్యేకంగా భావించే నోములతో మార్కెట్ కలకలలాడింది. ఆదివారం సెలవు దినం కావడంతో పెద్ద ఎత్తున నోములు కొనుగోలు చేశారు. పండుగలో ముఖ్యమైన రోజుగా భావించే భోగి పండుగ రోజున నోములను పెట్టి పూజించడం ఆనవాయితీగా వస్తుంది. దీంతో మహిళలు నోచుకునే నోములను ముందుగానే కొనుగోలు చేసుకున్నారు. భోగి పండుగ రోజున పిల్లలకు బోడపండ్లలో ముఖ్యమైన నేరపండ్లు, జీడిపండ్లు కొనుగోలు బాగా సాగింది. పండుగ మూడు రోజుల పాటు ఇంటి ముందు ముగ్గులు వేయడానికి కావాల్సిన రంగులను కొనుగోలు చేయడంతో రంగుల వ్యాపార సముదాయాలు రద్దీగా మారాయి. సంక్రాంతి అనగానే గుర్తుకు వచ్చేది గాలిపటాల వ్యాపారం జోరుగా సాగింది. పిల్లలు, పెద్దలు అని తేడా లేకుండా పతంగుల షాపుల వద్ద కొనుగోలు చేసేందుకు వచ్చారు. ఈసారి మార్కెట్‌లో చైనా మాంజాలు అమ్మకాలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు యంత్రాంగం చెప్పడంతో లోకల్ మాంజాపైనే ఎక్కువ ఆసక్తి చూపారు. పండుగ మూడు రోజులలో పతంగులు, మాంజాలకు వ్యాపారం జోరుగా సాగే అవకాశం ఉందని వ్యాపార వర్గాలు భావిస్తున్నాయి. జిల్లా కేంద్రంలోని గంజ్, నెహ్రూ పార్క్, కుమార్‌గల్లి, కంఠేశ్వర్, వినాయక్‌నగర్, నాందేవ్ వాడ, తదితర ప్రాంతాల్లో సందడి వాతావరణం నెలకొంది.





పతంగులు కొనుగోలు చేస్తున్న యువకులు




నాలుగేళ్లయినా పూర్తికాని వైకుంఠ ధామం

జర దేఖో!!

మోర్తాడ్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్సీ వాడ శివారులో గోవింద్‌రెడ్డి కాలనీ వెనుకభాగంలో గల సమశాన వాటిక పనులు నాలుగేళ్లు గడుసున్నా ఇప్పటి వరకు పూర్తి కాలేదు. శ్మశానవాటిక గత కొన్ని దశబ్దాలుగా ప్రజలు వినియోగించుకుంటున్నారు. మోర్తాడ్‌లోని సగాభాగం ప్రజలు ఈ శ్మశాన వాటికను వినియోగించుకుంటున్నారు. కాగా గత ప్రభుత్వ హయాంలో వైకుంఠ దామం నిర్మాణానికి ఉపాధి హామీ పథకం ద్వారా రూ.12 లక్షల 60 వేలు మంజూరయ్యాయి. అప్పటి మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి 2021 జనవరి 7న వైకుంఠదామం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. నాలుగేళ్లుగా దీని నిర్మాణం పూర్తి కాలేదు. వైకుంఠ దామంలో రెండు దహన వాటికలు, కాటి కాపరి గది స్మశానానికి వెళ్లే ప్రవేశ ద్వారం పనులు కొద్దిశాతం మాత్రమే మిగిలి ఉన్నాయి. దహనవాటికలు పూర్తికాక పోవడంతో బయటనే శవదహనాలు చేస్తున్నారు. మహిలకు, పురుషులకు వేర్వేరుగా స్నానవాటికలు పూర్త య్యాయి. అయితే స్మశాన వాటికకు వెళ్లే కంకర రోడ్డుకు గుంతలు పడి కంకర తేలి ప్రజలకు అసౌకర్యంగా మారింది.



మోర్తాడ్‌లో నాలుగేళ్లుగా పూర్తికాని వైకుంఠదామ నిర్మాణ పనులు



మోర్తాడ్‌లో కబ్జాకు గురవుతున్న శ్మశాన వాటిక భూమి

ఇదిలా ఉండగా శ్మశాన వాటిక స్థలం కబ్జాకు గురవుతుందని, శ్మశానానికి సంబంధించిన భూమి నాలుగు ఎకరాల వరకు ఉండేదని, అందులో అధిక భాగం అక్రమాణకు గురైందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. దీనిపై గ్రామస్థులు వివిధ కులాలకు చెందిన పెద్ద మనుషులు గతంలో రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకుపోయినా ఫలితం లేకుండా పోయిందని గ్రామస్థులు అంటున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు సమగ్రంగా తనిఖీ చేసి హద్దులు ఏర్పాటు చేసి ప్రధాన స్థలాన్ని కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

భోగ భాగ్యాలనిచ్చే భోగి

● భోగి మంటలతో పండుగ ● పిల్లలకు బోడ పండ్లు ● బొమ్మల కొలువుకు ప్రత్యేకం ● శ్రీ వైష్ణవ ఆలయాల్లో గోదాదేవి కల్యాణం

సంక్రాంతి అనగానే గుర్తొచ్చే ప్రధాన వేడుక బొమ్మల కొలువు. దీనిని భోగి నాడు ప్రారంభించి కనుమ పండుగ రోజు వరకు కొనసాగిస్తారు. బొమ్మల కొలువుని మూడు, అయిదు, తొమ్మిది మెట్ల వారీగా పేర్చడం తెలుగువారి సంప్రదాయం. ఓ పద్ధతి ప్రకారం మెట్ల మీద బొమ్మలను అందంగా అమరుస్తారు.

నిజామాబాద్ కల్చరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సంబురాల్లో భోగభాగ్యాలను అందించే పండుగగా భోగి జరుపుకుంటారు. భోగి పండుగతో మొదలై సంక్రాంతి వేడుకలు కనుమతో ముగుస్తాయి. మూడు రోజుల పాటు ఎంతో వైభవంగా జరుపుకునే ఈ వేడుకల్లో భోగి పండుగ రోజున భోగి మంటలతో ప్రారంభమవుతుంది. తెల్లవారుజామునే ఇంటి వాకిట్లను ముగ్గులతో ముస్తాబు చేసి పండుగను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. పండుగలో పాత వస్తువులను ఇళ్ల నుంచి తొలగించి కొత్త వస్తువులను పెట్టుకొని పండుగను జరుపుకుంటారు. ప్రధాన వీధులలో ఇళ్లలోని పాత వస్తువులను ఒకదగ్గరికి చేర్చి భోగి మంటలతో ఉత్సవాలను జరుపుకుంటారు. భోగి పండుగలో భోగభాగ్యాలు అందించమని వేడు కుంటూ దేవతా మూర్తులను కొలుస్తారు. పిల్లలకు నేరేడు పండ్లు, జీడి పండ్లు, చెరకు గడలు, అక్షింతలు, నాణెలతో బోడ పండ్లను పోసి పిల్లలు ఆయురారోగ్యంతో ఉండాలని కోరుకుంటారు. భోగి పండుగ రోజున తెల్లవారు జామున అభ్యంగ స్నానం ఆచరించి పూజలు నిర్వహించడం వల్ల సంవత్సరం పొడవునా శుభాలు చేకూరుతాయని భోగభాగ్యాలు లభిస్తాయని శాస్త్రం చెబుతుంది.

బొమ్మల కొలువు ప్రత్యేకం..

ఈరోజున గృహలక్ష్మీ దేవతగా ఆరాధించే బొమ్మల కొలువును ఏర్పాటు చేసుకొని పూజించడం సాంప్రదాయంగా వస్తుంది. బొమ్మల కొలువులో సంవత్సరం పొడవున సేకరించిన వస్తువులను ఒకదగ్గర పెట్టి పూజిస్తారు. బొమ్మల కొలువులో ధనుర్మాసం ప్రీతికరమైనదిగా భావించే విష్ణుమూర్తి, శ్రీమహాలక్ష్మికి కల్యాణ వేడుకలను నిర్వహించడం ప్రత్యేకతగా భావిస్తారు. లక్ష్మీనారాయణుడి వివాహంతో పాటు చిన్నారులను పెళ్లి కూతురు, పెళ్లి కొడుకులుగా ముస్తాబు చేసి పెళ్లి సందడి చేయడం బొమ్మల కొలువులో ప్రత్యేకతగా భావిస్తారు. ఈరోజున బొమ్మల కొలువు ఏర్పాటు చేసి మూడు రోజుల పాటు ముత్తయి దువులకు వాయినాలు, నోములను అందించడం ఆచారంగా వస్తుంది. భోగభాగ్యాలను అందించే బొమ్మల కొలువుకు మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

గోదాదేవి కల్యాణోత్సవం..

గోదాదేవి ఎంతో పరమ పవిత్రంగా ధనుర్మాస వ్రతాన్ని ఆచరించి భోగి పండుగ రోజున శ్రీరంగనాథున్ని పెళ్లాడినట్లుగా చరిత్ర చెబుతుంది. భోగి పండుగ పర్వదినాన శ్రీరంగ నాథున్ని తన పాటతో వైకుంఠం నుంచి భూలోకానికి వచ్చేటట్లు భక్తితో ఆరాధించి స్వామిని వివాహం చేసుకుంది. నెల రోజుల పాటు ధనుర్మాస ఉత్సవాలను జరుపుకున్న శ్రీవైష్ణవ ఆలయాలు భోగి పండుగ పర్వదినాన గోదాదేవి కళ్యాణంతో ఉత్సవాలను ముగిస్తారు. శ్రీవైష్ణవ ఆలయాల్లో చివరిదైన తిరుప్పావై పాశుదాన్ని పఠించి అమ్మవారికి విశేష పూజలు జరుపుతారు. గోదాదేవి రంగనాథుల కల్యాణోత్స వాలను అంగరంగ వైభవంగా జరుపుతారు. ఈ రోజున గోదారంగ నాథుని కల్యాణ వేడుకల్లో పాలుపంచుకున్న వారికి గోదా దేవి అనుగ్రహం తో పాటు రంగనాథుని అనుగ్రహంతో సిరిసంపదలు వస్తాయని భక్తులు విశ్వసిస్తారు.

ముస్తాబైన ఆలయాలు

గోదా రంగనాథుని కల్యాణోత్సవాలకు శ్రీవైష్ణవ ఆలయాలు ముస్తాబయ్యాయి. జిల్లా వ్యాప్తంగా శ్రీవైష్ణవ ఆలయాల్లో గోదాదేవి రంగనాథుని కల్యాణోత్సవం నిర్వహించడానికి ఆయా ఆలయ కమిటీలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కళ్యాణోత్సవం నిర్వహించడానికి కొబ్బరి మట్టాలు, అరిటాకులు, వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా వేదికను అలంకరించారు. జిల్లాలోని శ్రీవైష్ణవ క్షేత్రాలైన జెండా బాలాజీ మందిర్, హమాల్‌వాడి గోదాదేవి ఆలయం, 7వ బెటాలియన్ వెంకటేశ్వర స్వామి ఆలయం, డిచ్‌పల్లి ఖిల్లా రామాలయం, చక్రంగుడి వెంకటేశ్వర స్వామి ఆలయం, సుభాష్‌నగర్ రామాలయం, ఆర్మూర్ రామాలయం, నర్సింగ్‌పల్లి వెంకటేశ్వర ఆలయం, బోధన్ వెంకటేశ్వరస్వామి, పోచంపాడ్ రామాలయం, అపురూప వెంకటేశ్వర స్వామి ఆలయాలు గోదాదేవి, రంగనాథుని కల్యాణోత్సవాలకు ముస్తాబయ్యాయి.

వైభవంగా గోదారంగనాథ స్వామి కల్యాణం

మోస్రా, జనవరి12(ఆంధ్రజ్యోతి): మోస్రా మండల కేంద్రంలోని శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానంలో ధనుర్మాస ఉత్సవాల సందర్భంగా గోదారంగ నాథ స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మాట్లాడుతూ సాక్షాత్తు భూదేవి గోదాదేవిగా జన్మించి శ్రీకృష్ణ పరమాత్మని ఈ 30రోజులు ధనుర్మాస వ్రతం ఆచరించిస్వామి వారిని వివాహం చేసుకున్న సందర్భంగా ఈ గోదా రంగనాథ స్వామి వారి కల్యాణ మహోత్సవం జరుపుతారన్నారు. గత 60 ఏళ్లగా ఉత్సవాలు జరుపుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ కల్యాణ మహోత్సవాన్ని అర్చకులు శ్రీనివాస్ ఆధ్వర్యంలో అర్చకులు నవీన్ వేద మంత్రోచ్చరణల మధ్య కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. కల్యాణ కార్యక్రమం అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పలు గ్రామాల భక్తులతో పాటు నిజామాబాద్, బోధన్, బాన్సువాడల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

రక్తదానం.. మరొకరికి ప్రాణదానం



రక్తదానం చేసిన మహిళలకు ఫ్రూటీ అందజేస్తున్న భక్తులు

మద్నూర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): అనంత శ్రీ విభూషత్ జగద్గురు రామానంద చార్య శ్రీ స్వామి నరేంద్ర చార్య మహారాజ్ జుక్కల్ ఉపపీఠం, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరం మద్నూర్ మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. రక్తదాన శిబిరంలో మహిళలు సైతం ముందుకు వచ్చి రక్తదానం చేయడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ జుక్కల్ నియోజక వర్గంలోని ఆయా మండలాల్లో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తున్న జగద్గురు నరేంద్ర ఆచార్య మహారాజ్ భక్తులకు అభినందించారు. ఒకరు చేసే రక్తదానం మరొకరికి ప్రాణదానమవుతుందని గుర్తు చేశారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఎంతో పురోగతి సాధించినర రక్తాన్ని మనిషి సేకరించాల్సిందే తప్ప కృత్రిమంగా తయారు చేయలేమని, రోడ్డు ప్రమాదా ల్లో గాయపడినప్పుడు కాన్పులు, ఆపరేషన్స్ సందర్భాల్లో ఇతర ఏ కారణంతోనైనా రక్తాన్ని కోల్పోయినప్పుడు రక్తహీనత ఉన్న వారిక రక్తం ఎక్కించాల్సి వస్తుందని, అవసరమైన సందర్భాల్లో వెతికితే అ వసరమైన రక్తం దొరకదని, అందుకే ముందుగా రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేసి రెడ్ క్రాస్ సొసైటీలో నిల్వ చేయడం జరుగుతుందని సూచించారు. ఈ శిబిరాలలో యువకులు, మహిళలు పాల్గొని రక్తదానం చేసిన వారికి కృతజ్ఞతలు తెలి పారు. ఈ కార్యక్రమంలో మద్నూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పరమేష్ పటేల్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు హన్మాండ్లు స్వామి, భక్తులు గంగారాం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్‌రావుపల్లి కూడలిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

● చలనం లేని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు
● లబోదిబోమంటున్న ప్రయాణికులు, వాహనదారులు



నరసింగరావుపల్లి కూడలి ఇదే

నిజాంసాగర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): నర్సింగరావుపల్లి కూడలిలో ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ప్రజలు విన్నవిస్తూ ఉన్నారు. జాతీయ రహదారి 161 కాగా నర్సింగ్‌రావుపల్లి కూడలిలో సీసీ కెమెరాలు లేక వాహనదారులు, ప్రజలు అనేక పాట్లు పడుతున్నారు. ఎన్‌హెచ్‌ఏఐ అధికార యంత్రాంగం నిజాంసాగర్ ప్రధాన చౌరస్తా అయినా నర్సింగ్‌రావుపల్లి కూడలిలో ఎల్‌యూపీ వంతెన నిర్మాణాన్ని చేపట్టారు. ఎల్‌యూపీ కింది భాగం నుంచి నిజాంసాగర్, నిజామా బాద్ ప్రాంతాలకు ఆర్టీసీ బసుసలతో పాటు ప్రైవేట్ వాహనాలు వెళుతూ ఉన్నాయి. ఎల్లారెడ్డి - నాందేడ్ వెళ్లే వాహనాలు కూడా ఎలూపి నుండే వెళ్లాల్సి వస్తుంది. ఈ కుడిలో ఎప్పుడు ఏం జరుగుతుందో అని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. వాహనదారులు, డ్రైవర్లు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుం దోనని ఆందోళన చెందుతున్నారు. నిజాంసాగర్ వెళ్లే ప్రధాన రహదారి అయిన నర్సింగ్‌రావుపల్లి కూడలిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్ల యితే ఏ సంఘటన జరిగినా సునాయాసంగా తెలుసుకోవాల్సిన అవకాశం ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికార యంత్రాంగం న ర్సింగ్‌రావుపల్లి కూడలిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

జాతీయస్థాయి క్రీడాకారిణికి సన్మానం



జక్రాన్‌పల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): జక్రాన్‌పల్లి గ్రామానికి చెందిన జాతీయస్థాయి క్రీడాకారిణి కన్న వర్షిణిని ఆదివారం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. గన్న వర్షిణిని నిజామాబాద్‌రూరల్ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సొప్పారి వినోద్; మాజీసర్పంచ్ కాటపల్లి నర్సారెడ్డిలు సన్మానించారు. 37వ సబ్‌జూనియర్ జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీల్లో బంగారు పతాకాన్ని సాధించిన సందర్భంగా గన్న వర్షిణిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ జితేందర్ నాయక్, కాంగ్రెస్ నాయకులు సుదీర్, ప్రసాద్, తిరుపతి, చింటు, తదితరులు పాల్గొన్నారు.

నాళేశ్వర్‌లో వాలీబాల్ క్రీడలు ప్రారంభం

నవీపేట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాళేశ్వర్‌లో ఆదివారం వాలీబాల్ క్రీడ పోటీలు ప్రారంభించారు. రాబోయే మహ శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఈ క్రీడా పోటీలు ప్రారంభించారు. ప్రతి సంవత్సరం ఆనవాయితీ ప్రకారం క్రీడా పోటీలు నిర్వహిస్తుంటారు. అంతకు ముందు స్వామి వివేకానంద జయంతి సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సరిన్, ప్రవీణ్ కుమార్, శ్రీనివాస్, పెద్ద ఎత్తున యూత్ సభ్యులు పాల్గొన్నారు.



నాళేశ్వర్‌లో వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

నేను రాను బిడ్డో సర్కారు దవాఖానాకు!

● కు.ని. ఆపరేషన్లు నిలిపివేత ● డయాలసిస్ కేంద్రంలో అందని సేవలు
● పేరుకే మూప్పై పడకల ఆస్పత్రి ● వైద్యులు లేక అందని సేవలు



కు.ని అపరేషన్లు లేక తాళం వేసిన అపరేషన్ థియేటర్



డిచ్‌పల్లి మూప్పై పడకల ఆస్పత్రి

డిచ్‌పల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మూప్పై పడకల ఆస్పత్రి వైద్య సేవలు అటకెక్కాయి. నేనురాను బిడ్డో సర్కారు దవాఖానకు అనే చందంగా ఆస్పత్రి తయారైంది. ఈ మూప్పై పడకల ఆస్పత్రిలో కొన్ని నెలలుగా వైద్య సేవలు పూర్తి స్థాయిలో అందుబాటులో లేక పోవడం కు.ని. అపరేషన్లు జరగక సుమారు ఏడాది గడస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. డయాలసిస్ చేయ డానికి అన్ని రకాల పరికరాలు ఉన్న యూరాల జిస్ట్ వైద్యుడు లేకపోవడంతో సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. ఆస్పత్రిలో మందులు లేక గ్రామీణ ప్రజలను వెనిక్కి పంపించే పరిస్థితి దాపురించింది. కనీసం చిన్న పిల్లలకు సంబంధించిన సిరప్‌లు, సాధరన జ్వరాలకు ఇచ్చే మందు గోళీలు లేకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. మరి ముఖ్యంగా సీజనల్ వైద్యులు సంక్రమిస్తే మందులు సైతం లేకపోవడం గమన్హారం. ఆస్పత్రికి రోగులు వస్తే గోళీలు లేక ప్రైవేట్ మెడికల్ కేంద్రాలకు వైద్యులు పంపిస్తున్నారు. ఆస్పత్రిలో పూర్తి స్థాయిలో వైద్యుల నియామకం ముఖ్యంగా గైనాకాలాజిస్ట్, ఎండీ సర్జన్, జనరల్ ఫిజిషియన్, అనెస్థేషియా, పిల్లల వైద్య నిపుణులు ఖాళీగా ఉండటంతో సేవలు నిలిచిపోయాయి. ఆస్పత్రి నిర్వహనకు 12 మంది స్టాప్ నర్సులు ఉండాల్సి ఉండగా ఆరుగురు మాత్రమే విధుల్లో కొనసాగుతున్నారు. మరో 6 ఖాళీగా ఉండటంతో సేవలు ప్రజలకు పూర్తిస్థాయిలో అందడం లేదు. దీంతో గ్రామీణ ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. అటు ప్రైవేట్ దవాఖానకు పోలేక ప్రభుత్వ ఆస్పత్రి సేవలు అందక గ్రామీణ ప్రజలు తీవ్ర స్థాయిలో ఇక్కట్లు పడుతున్నారు. వెంటనే జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



బోర్డుకే పరితమైన డయాలాసిస్ కేంద్రం

క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు



విజేతకుల బహుమతులు అందజేస్తున్న క్షత్రియ సమాజ్ పెద్దలు

ఆర్మూర్‌టౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చిన్నబజార్ లో క్షత్రియ సమాజ్, యువజన సమాజ్ ఆధ్వర్యంలో ఆదివారం క్షత్రియ మహిళలకు, చిన్నారులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 125మంది మహిళలు, చిన్నారులు పాల్గొనగా ఉత్తమ ప్రతిభ కన బర్చిన వారికి బోబిడె శివాణికి రూ.3 వేలు ప్రథమ బహుమతి, సాత్‌పూతే రూప రూ.2వేలు ద్వితీయ, గరడి హసిని రూ.1000 మూడవ బహుమతిని అందజేసి కన్సోలేషన్ బహుమతులను ప్రతీఒక్కరికి అందజేశారు. ఈ కార్యక్రమంలో క్షత్రియ సమాజ్ అధ్యక్షుడు బచ్చేవల్ రెడ్డిప్రకాష్, కార్యదర్శి బారడ్ గంగామోహన్, ఖాందేశ్ శ్రీనివాస్, పడాల్ గణేష్, ఖాందేశ్ సంగీత, కర్తన్ దినేష్, గరడి కిషన్, సాత్‌పూతే సంతోష్, భూమని నీరజ్, సుకేష్ వర్మ, డీకే శ్రీహరి, డీజే సులోచన, బోచ్‌కర్ వీణ, తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో పూజలు చేసిన హైకోర్టు విశ్రాంత న్యాయాధికారి

బోధన్‌రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని ప్రసిద్ధిగాంచిన ఏకచక్రేశ్వరాలయాన్ని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విశ్రాంత న్యాయాధికారి, తెలంగాణ మొట్టమొదటి లోకాయుక్త సభ్యుడు వెంకట రాములు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా పురాతన ఆలయ విశిష్టతను వేద పండితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తన స్వస్థలం బోధన్ అని చిన్ననాటి మిత్రులను, బంధువులను ఆత్మీయంగా కలిశారు. ఆనాటి మధుర జ్ఞాపకాలను బంధు, మిత్రులతో పంచుకున్నారు. బసవతారక్ నగర్‌లో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉన్నత విద్యను అభ్యసించడం జరిగిందన్నారు. పట్టణంలోని ఎల్లమ్మ మందిరాన్ని సందర్శించారు. తహసీల్దార్ విఠల్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో శివాలయం కమిటీ చైర్మన్ హరికాంత్ చారి, బోధన్ న్యాయవాదులు పాల్గొన్నారు.



శివాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న విశ్రాంత న్యాయాధికారి



విజ్ఞాన యాత్రలో కాటేపల్లి పాఠశాల విద్యార్థులు

విజ్ఞాన యాత్రలో కాటేపల్లి పాఠశాల విద్యార్థులు

పెద్ద కొడప్‌గల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాటేపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు వరంగల్ విజ్ఞాన యాత్రకు తరలి వెళ్లారు. పాఠశాలకు సంక్రాంతి సెలవులు ప్రకటించడంతో పాఠశాల 10వ తరగతికి చెందిన విద్యార్థులను ఉపాధ్యాయులు విజ్ఞాన యాత్రకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు విజ్ఞానం అవసరమని, ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు టూర్‌కు తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ విజ్ఞానయాత్రలో భాగంగా వరంగల్ వేయి స్తంభాల గుడి, భద్రకాళి అమ్మవారి ఆలయం కట్టడాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

26 నుంచి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అమలు

• ఉత్తర్వులను జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

నిజాంసాగర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న భూమి లేని కుటుంబాలు వ్యవసాయ కూలీ పని మీద ఆధారపడి జీవనం సాగిస్తున్న వారికి ఈనెల 26వ తేదీ నుంచి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని అమలు చేస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు గ్రామీణ ప్రాంతాల్లో భూమి లేని వ్యవసాయ కూలీ మీదనే ఆధారపడి ఉన్న వారిని గుర్తించేందుకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఈ పథకం కింద 12 వేల రూపాయల చొప్పున రెండు విడతలుగా ఇందిరమ్మ భరోసా పథకాన్ని అందిస్తున్నట్లు ఎంపీడీవో గంగాధర్ తెలిపారు. ఈ పథకం కింద లబ్ది పొందే లబ్దిదారులు ఎన్ఆర్ఈజీఎస్‌లో 2023-2024లో 20 రోజుల పాటు పని చేసి ఉండాలి. డీబీటీ పద్ధతిలో నిధులను వ్యవసాయ కూలీ ఖాతాకు ఈ భరోసా జమ చేయనున్నారు. పంచాయితీరాజ్ కమిషనర్ గ్రామీణ అభివృద్ధి అధికారి నోడల్ డిపార్టుమెంట్‌గా వ్యవహరించనున్నది. జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారు. జిల్లా కలెక్టర్ తమ జిల్లా సంబంధించిన పథక అమలు, ఫిర్యాదుల పరిష్కారం కోసం బాధ్యులుగా ఉంటారు.



బేగంపూర్‌లో రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

పెద్ద కొడప్‌గల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బేగంపూర్ గ్రామంలో ఆదివారం రహదారి భద్రత ప్రమాణాలపై గ్రామస్తులకు హైవే సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హైవే రోడ్ సేఫ్టీ మేనేజర్ ప్రతాప్‌సింగ్ మాట్లాడుతు రహదారిపై ప్రయాణం చేసే సమయంలో వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడపరాదని, రహదారిపై వ్యతిరేక దిశలో ప్రయాణం చేయరాదని సూచించారు. దీంతో పాటుగానే వాహనదారులు రహదారిపైకి వచ్చే సమయంలో గాని, రహదారిపై నుండి కిందికి దిగే సమయంలో ఇరుపక్కల చూసుకుని వాహనాలు మళ్ళించాలని సూచించారు. వాహనాలు నడిపే సమయంలో సెల్‌పోన్ మాట్లాడుతు వాహనం నడపరాదని. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, ఇక కార్లు, జీపులు ఇతర వాహనాలు నడిపేవారు సీట్‌బెల్ట్ ధరించాలని సూచించారు. ఇక ముఖ్యంగా పాదచారులు రహదారి దాటేసమయంలో జీబ్రా క్రాసింగ్‌ల వద్ద మాత్రమే రహదారి దాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రహదారి భద్రత సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



కిష్టాపూర్‌లో వాలీబాల్ క్రీడాకారులతో గ్రామ పెద్దలు

కిష్టాపూర్‌లో వాలీబాల్ పోటీలు ప్రారంభం

బీర్కూర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలం కిష్టాపూర్ గ్రామంలో నాడివారం వాలీబాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. స్వామి వివేకానంద యూత్ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కింగ్స్ అధ్యక్షుడు జెట్టి విజయకుమార్, మాజీ సరంచ్ లు బాబురావు .కిష్టారెడ్డి. మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెద్ది మారుతి రెడ్డి, గ్రామ పెద్దలు పుల్లేని పీరయ్య, రాధాకృష్ణ అంజయ్య శ్రీనివాస్ జెట్టి, యువకులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ

రక్త దానం ఒకరికి ప్రాణ దానం

కామారెడ్డి టౌన్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): రక్తదానం ఒకరికి ప్రాణదానమని మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియచంద్రశేఖర్ రెడ్డి అన్నారు. ఆదివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కళాభారతీలో రక్తదాతలకు సన్మాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 17 సంవత్సరాల నుండి 25 యూనిట్ల రక్తాన్ని, తలసేమియా చిన్నారుల కోసం 4500ల యూనిట్ల రక్తాన్ని, కరోనా వ్యాధి సమయంలో 100 యూనిట్ల ప్లాస్మాను, 250కి పైగా రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయడం మామూలు విషయం కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో రక్తదాతల సమూహఫౌండర్ బాలు,సీఎంఎస్ గ్రూప్ ఆఫ్‌ప్రైమ్స్ చైర్మన్ మారుతి,ఆర్‌కేవిద్యాసంస్థల చైర్మన్ జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ నుంచి టీడీపీలో చేరిక

తాడ్వాయి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీని వీడి తిరిగి టిడిపి పార్టీలో చేరినట్లు కాంగ్రెస్ సీనియర్ నాయకులు కమ్మరి రాజు తెలిపారు ఈయన శనివారం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నివాసంలో రాష్ట్ర నాయకులు పైడి గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరినట్లు ఈయన తెలిపారు, అనంతరం మాట్లాడుతూ టీడీపీకి పూర్వ వైభవం తీసుకు వచ్చేందుకు కృషి చేస్తానని తెలిపారు.

వివేకానందుడిని యువత ఆదర్శంగా తీసుకోవాలి

పెద్ద కొడప్‌గల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద 162వ జయంతి వేడుకలు పెద్ద కొడప్‌గల్ మండలంతో పాటు జుక్కల్ మండలంలో యువత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయా మండల కేంద్రాలతో యువత స్వామి వివేకానందచిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతు స్వామి వివేకానంద భారతదేశ గొప్పతనాన్ని ప్రపంచ దేశాలకు చాటడంతో పాటు, అమెరికా సభల్లో భారతదేశ విశిష్టతను, హిందూ మత ప్రాదాన్యతను అక్కడి ప్రజలకు వివరించారని తెలిపారు. దీంతో పాటుగానే స్వామి వివేకానంద దేశాన్ని ప్రేమించడంతో పాటు, భారతదేశ ప్రాచీన ఔన్నత్యాన్ని పెంపొదించాలని కృషి చేశారని తెలిపారు. అమెరికా నుంచి తిరిగి వచ్చి రామకృష్ణ మఠాన్ని స్థాపించి ఇక్కడి యువతకు దిశనిర్దేశ్యం చేశాడని తెలిపారు. స్వామి వివేకానంద చేసిన సేవలకు గాను భారతదేశ ప్రభుత్వం ఆయన జన్మదినాన్ని జాతీయ యువజన దినోత్సవంగా ప్రకటించడం జరిగిందని తెలిపారు.

బీర్కూర్: బీర్కూర్ మండలం బైరాపూర్ గ్రామంలో ఆదివారం స్వామి వివేకానంద 161వ జయంతి వేడుకలను స్థానిక యువకులు ఘనంగా నిర్వహించారు. స్వామిజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి యువతకు స్వామి వివేకానంద ఆదర్శప్రాయుడని అన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ స్వామిజీ చూపిన మార్గంలో పయనించాలన్నారు.

నసురుల్లాబాద్:మండలంలోని ఆయా గ్రామాలతో పాటు, మండల కేంద్రంలో ఆదివారం స్వామి వివేకానంద జయంతి వేడుకలను యువకులు, ఆయా పార్టీల నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు సున్నం సాయిలు మాట్లాడుతూ యువకులు స్వామి వివేకానంద స్పూర్తితో ముందుకెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు అరిగే నారాయణ, అనుసూరి శ్రీనివాసరావు, యాదగిరి గౌడ్, గంగాధర్ గుప్తా, కంది పెద్ద మల్లేష్, ఉల్లెంగ గోపి, శేఖర్ పాల్గొన్నారు.

పిట్లం :మండల కేంద్రంలోని తిమ్మనగర్ చౌరస్తాలో భజరంగ్‌దళ్, విశ్వహిందుపరిషత్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు నిర్వహించారు.



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఆదివారం పిట్లంలో స్వామి వివేకానంద మహనీయుని చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన చూపిన మార్గంలో యువత నడవాలని సూచించారు. కార్యక్రమంలో భజరంగ్‌దళ్ సంయోజక్ రంజిత్, నాగరాజు, పవన్‌చ వినాయక్, ప్రణయ్, అశోక్‌రాజ్, రాము,దయానంద్‌చ రమేష్‌చ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

సదాశివనగర్ : స్వామి వివేకానంద జయంతి వేడుకలను ఆదివారం మండలంలో ఘనంగా నిర్వహించారు.లింగంపల్లి గ్రామంలో స్వామి వివేకానంద యువజనసంఘం సభ్యులు ఏర్పాటుచేసిన విగ్రహాన్ని చత్రపతి శివాజీ యువసేన అఖండ భారత్ ప్రధానకార్యదర్శి యోగి ప్రభుజీ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి హిందూధర్మరక్షణ కోసం ఉపయోగపడని శరీరం, డబ్బు ఎంతపెరిగిన వృదానే అవుతుందని అన్నారు. ప్రతి వ్యక్తి దేశం కోసం పాటుపడాలని అప్పుడే భారతదేశ సంప్రదాయం ఆచరణలో సాధ్యమవుతుందని తెలిపారు. ప్రపంచానికి భారతదేశం ఆధ్యాత్మిక విలువలను చాటి చెప్పిన మహనీయుడు స్వామి వివేకనంద ఆయన బోధనలు ఎప్పుడూ యువతకు స్ఫూర్తినిస్తాయని తెలిపారు.ఆయన ప్రసంగాలు యువకుల్లో చైతన్యం నింపుతాయని తెలిపారు. అందుకే ఆయన జయంతి రోజైనజనవరి 12 న జాతీయయువజన దినోత్సవంగా జరుపుకుంటామన్నారు.ఈ కార్యక్రమంలో స్వామి వివేకానంద యువజనసంఘం సభ్యులతో పాటు కన్నే రాజ్‌బాబా,మహాదేశగురూజీ తదితరులు పాల్గొన్నారు.

బిచ్కుంద : ప్రతి ఒక్కరూ వివేకనంద స్వామి అడుగుజాడలో నడవాలని వివేకానంద ఉత్సవ కమిటీ సభ్యులు అన్నారు. ఆదివారం బిచ్కుంద మండల కేం ద్రంలోని వివేకానంద పాఠశాలలో వివేకానంద జయం తి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. దేశం గర్వించేవిదంగా యువత వివేకనందుని ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వివేకానంద ఉత్సవ సమితి అధ్యక్షుడు శివకాంత్, అతిధులు సుదీర్‌చోప్రా, డాక్టర్ నర్సింలు, వాసరేనాగనాథ్, భీమ్‌రావు, గణేష్‌సాయి, ప్రశాంత్, పండరి తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయి: స్వామి వివేకానంద జయంతి సందర్భంగా మండల కేంద్రంలోని వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం స్వీట్లు పంచుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ఆమె వివేకానంద చెప్పిన బోధనలో అడుగు జాడల్లో నడచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ లింగరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్ రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకట్‌రావు, మండల అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నర్సింలు, తిరుపతిరెడ్డి, ఉపాధ్యక్షులు యాదగిరి, శేఖర్, బూత్ అధ్యక్షులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లింగంపేట : లింగంపేట మండల కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో ఆదివారం స్వామి వివేకానంద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్‌రావు మాట్లాడుతూ... స్వామి వివేకానంద తన బోధనలతో యువతను సన్మార్గంలో నడిపించారని తెలిపారు. యువత స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకొని మంచి మార్గంలో నడవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ లింగారావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు దత్తురాంలు, ఎల్లారెడ్డి మండల పార్టీ అధ్యక్షుడు నర్సింలు, ప్రధాన కార్యదర్శి రాంచందర్, నవీన్, ఉదేశ్, క్రాంతీ, వంశీ, కిరణ్, బాను ప్రసాద్‌లతో పాటు



లింగంపేటలో నివాళులు..

నాయకులు ఉన్నారు.

మద్నూర్ : భారతదేశ సంస్కృతి సాంప్రదాయాన్ని వైభవాన్ని విశ్వ వేదికపై ఎలుగెత్తి చాటిన మహా మేధావి, స్వామి వివేకానంద అని బీజేపీ నాయకులు కొనియాడారు. ఆదివారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో, పెద్ద శక్కర్గా పాఠశాలలో వివేకానంద జయంతి ఉత్సవాలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులను అందజేశారు. మద్నూర్ బీజేపీ ఆధ్వర్యంలో జరిగిన వివేకానంద జయంతి ఉత్సవాలలో నాయకులు తుకారం, అజయ్, కృష్ణ, పటేల్ తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ: మండల కేంద్రంలోని పలుగడ్డ ప్రాంతంలో ఆదివారం స్వామి వివేకానంద జయంతి సందర్భంగా బీజేపీ మండలాధ్యక్షుడు మద్దూరి భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత స్వామి వివేకానంద చూపిన బాటలో నడవలన్నారు. కార్యక్రమంలో రవిందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తెల్ల ప్రభాకర్, నర్సింలు, రవి, తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూరు: భిక్కనూరు మండలకేంద్రంతో పాటుగా మండలంలోని ఆయాగ్రామాల్లో స్వామి వివేకానందా జయంతి కార్యక్రమాన్ని ఆదివారం ఆయాగ్రామాల్లో యువజన, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు భిక్కనూరు పట్టణంతో పాటుగా మండలంలోని ఆయాగ్రామాల్లో వివేకానందా విగ్రహాలకు, చిత్రపటాలకు ప్రజాప్రతినిధులు, నాయకులు, యువజన సంఘాల ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, నాయకులు మాట్లాడుతూ నేటి యువత వివేకానందను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, బీజేపీ నాయకులు, ఏబీవీపీ, హిందు జాగృతీ ప్రతినిధులు, ఆయాపార్టీల నాయకులు, గ్రామపెద్దలు, యువజన, విద్యార్థి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ ఏటీఎం ధ్వంసం చేసి నగదు చోరీ

పిట్లం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఎస్‌బీఐ ఏటీఎంను దుండగులు గ్యాస్ కట్టర్‌తో కట్ చేసి అందులో ఉన్న నగదును దోచుకెళ్లిన సంఘటన కామారెడ్డి జిల్లా పిట్లంలో చోటు చేసుకుంది. వివరాలు.. కామారెడ్డి జిల్లా పిట్లంలో జాతీయ రహదారి మండల పరిషత్ కార్యాలయం ముందు గల ఎస్‌బీఐ బ్యాంక్ ఏటీఎంలో దొంగతనం పాల్పడిన సంఘటన చోటుచెసుకుంది. దుండగులు పిట్లంలో గల ఎటియంలో బారీ నగదును దోచుకున్నారు.గ్యాస్ కట్టర్ ద్వారా ఎటియం వెనుకాల కటింగ్ చెసి అందులో నగదును ఎతుకెళ్ళినారు.ఎటియంలో 17 లక్షల 79 వెల వంద రుపాయలు నగదు ఉందని ఎటియం సుప్రవేజర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. దుండగులు పక్క ప్లాన్‌తో దోపిడికి పాల్పడినట్లు తెలుస్తుంది.ముందుగా ముసుగుతో ఉన్నదుండగులు ఎటియం గదిలోనికి ప్రవేశించారు.సీసీ కెమరాలపై స్ప్రె చెసి ముఖాలను కనబడకుండ చెశారు, ఆతర్వాత దోపిడికి పాల్పడినారు.గతంలో పలు మార్లు ఎస్‌బిఐ ఎటియంను దుండగులు దోంగతనానికి ప్రయత్నించి విఫల మయ్యా రు.పోలీసులు సమాచారం అందడంతో ఎస్‌బిఐ ఎటియం వద్దకు వెళ్ళి పూర్తిగా వివరాలు సేకరిస్తున్నారు.ఎటియం చుట్టు పక్కల గల సీసీ పుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు.ఎస్‌బిఐ ఎటియం సుప్రవేజర్ పిర్యాదు మెరకు కెసు నమోదు చెశామని ఎస్సై రాజు తెలిపారు.



ధ్వంసమైన ఏటీఎం

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటా

● ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణరెడ్డి

భిక్కనూరు, జనవరి 12(ఆంధ్ర జ్యోతి): కామారెడ్డి నియోజకవర్గంలోని బీజేపీ పార్టీ నాయకులు, కార్యకర్తల ప్రతి కుటుంబానికి అండగా ఉంటానని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. ఆదివారం బీజేపీ భిక్కనూరు పట్టణ అధ్యక్షుడు గరిగంటి నర్సింలు తండ్రి శంకరయ్య ఇటీవల మరణించగా ఆయన కుటుంబాన్ని పరామర్శించి మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శంకరయ్య మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని ఆనారోగ్యంతో బాధపడుతున్న నర్సింలు క్షేమసమాచారాన్ని అడిగితెలుసుకుని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఉప్పరి రమేష్, నాయకులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన జిల్లా అధికారులకు సన్మానం

నసురుల్లాబాద్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో విధులు నిర్వహించి ఈ మధ్యకాలంలో బదిలీపై వెళ్లిన అధికారులకు ఆదివారం నసురుల్లాబాద్ మండలం మైలారం గ్రామంలో గల కొచ్చెరి మైసమ్మ వద్ద సన్మాన కార్యక్రమం నిర్వహించారు. గత 8 ఏళ్లుగా జిల్లా బీసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ శ్రీనివాస్, బీసీ ఉద్యోగ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవంత్‌లకు శాలువా కప్పి అభినందించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ ఉద్యోగస్తులకు బదిలీ తప్పనిసరి అని, తోటి ఉద్యోగస్తులు భావోద్వేగానికి గురయ్యారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా ఉద్యోగ సంఘం అధ్యక్షులు నాగరాజు, ఈసి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగస్తులు భాగయ్య, సరస్వతి, సుధాకర్, ఆశిష్ తదితరులు ఉన్నారు.

ఎల్లారెడ్డిలో ప్రియాంక గాంధీ జన్మదిన వేడుకలు

ఎల్లారెడ్డి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఎల్లారెడ్డి సెగ్మెంట్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకురాలు, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి వాయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పథకాలు ప్రజలలోకి తీసుకెళ్లాలన్నారు.

డాక్టర్ సురేందర్‌కు ఘన సన్మానం

కామారెడ్డిటౌన్,జనవరి 12(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరిత్యం పశుపక్షుల జీవనవిధానంపై దీర్ఘకాలంగా పరిశోధన చేసిన లోంకతండాకుచెందిన డాక్టర్ సురేందర్‌కు ఇటీవల ఎన్‌జీరంగా యూనివర్సిటి డాక్టరేట్ అందించింది. దీంతో ఆదివారం మండలంలోని సేవాలాల్ ఆలయంలో బంజారా నాయకులు ఘనంగా సన్మానించారు.స్థానిక వనరులను ఉపయోగించుకుని ఉన్నత స్థాయికి ఎదిగి దేశానికి మంచి పేరు తీసుకురావాలని సురేందర్‌కోరారు.ఈ కార్యక్రమంలో షెర్ శిక్వాడి ఎల్లారెడ్డిఇంచార్జ్ వ్యాయమ ఉపాధ్యాయుడు లక్ష్మన్‌రాథోడ్, మైనార్టీ యూత్ అధ్యక్షుడు సల్మాన్, స్థానికులు బాలకృష్ణ, దశరథ్, సుభాష్, జైత్రం, దేవి తదితరులు పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

నసురుల్లాబాద్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): నసురుల్లాబాద్ మండలం మైలారం గ్రామ శివారులో గల కొచ్చేరి మైసమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కాకుండా వివిధ మండలాల భక్తులు వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మెక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారం కొచ్చేరి మైసమ్మ తల్లి అని అన్నారు.

ప్రారంభమైన శివదీక్షలు

బిచ్కుంద,జనవరి 12(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రిని పురస్కరించుకుని మండలంలోని ఖత్‌గావ్ బసవేశ్వర మఠసంస్థాన్ మఠాధిపతి మల్లికార్జునప్ప స్వామిజీ శివదీక్షపరులకు మాలధారణ చేసి భిక్షమంత్రాన్ని ఉపదేశించారు. మండల కాల శివదీక్షలో మలాధారణ చేపట్టిన స్వాములు ప్రతిరోజు ఒకపూట భిక్ష, రాత్రి,ఉదయం పూజ అనంతరం గ్లాస్ పాలను స్వీకరించడం శివుని ఆశీస్సులతోనే సాధ్యమన్నారు.

గొట్టిముక్కులలో క్రికెట్ పోటీలు

దోమకొండ, జనవరి 12(ఆంధ్రజ్యోతి):మండలంలోని గొట్టిముక్కుల గ్రామంలో ఆదివారం క్రికెట్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహకులు ధరిపల్లి జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ సంక్రాంతి పండగ సందర్భంగా గ్రామంలో యువతకు క్రికెట్ పోటీలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మూడు టీంలుగా ఏర్పడి క్రీడలో పాల్గొన్నారని గెలుపొందిన టీంకు మొదటి, రెండవ, మూడవ బహుమతులు అందజేసినట్లు తెలిపారు. టీం లీడర్లుగా ముదాం ప్రసాద్, ధరిపల్లి సంపత్‌రెడ్డి, పోతాగొని విఘ్నేష్‌గౌడ్‌లు ఉన్నట్లు తెలిపారు.

దోమకొండ కోటలో తెలంగాణ సాహిత్య సమాలోచన

దోమకొండ, జనవరి 12(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని గడికోటలో ఆదివారం తెలంగాణ సాహిత్య సమాలోచన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని కోట సంస్థానదీశులు కామినేని అనిల్ కుమార్ వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కవులతో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ ఆచార్య వెలుదండ నిత్యానందరావు(పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం హైదరాబాద్)ఆత్మీయ అతిథి పద్మభూషణ్ వరప్రసాదరెడ్డి, పెండ్యాల వైదనాథ్‌రావు హైదరాబాద్, మైసూర్, విశాఖపట్నం, హైదరాబాద్‌కు చెందిన కవులు ఎద్ద ఎత్తున పాల్గొన్నారు. సాయంత్రం తెలంగాణ జానపదం గేయాలను కళాకారులు జబర్దస్త్ జీవన్, శ్రీనివాస్, వెంకటేష్‌లు పాడివినిపించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, గంట వెంకటస్వామి, మాజీ సర్పంచ్ నల్లపు అంజలి, శ్రీనివాస్, గడికోట మేనేజర్ బాబ్జి, నర్సింహారావు, సూపర్ వైజర్‌లు నేతుల గణేష్ యాదవ్, కంది మనోజ్ కుమార్, పెద్దిరెడ్డి లచ్చిరెడ్డి, రంజిత్,నీరడి వెంకటేష్, బిక్కనూర్ సౌత్ క్యాంపస్ అద్యపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాల ఏర్పాటు అభినందనీయం

మద్నూర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : అనంత శ్రీ విభూషత్ జగద్గురు రామానంద చార్య శ్రీ స్వామి నరేంద్ర చార్య మహారాజ్ జుక్కల్ ఉప పీఠం, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరం మద్నూర్ మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. రక్తదాన శిబిరంలో మహిళలు సైతం ముందుకు వచ్చి రక్తదానం చేయడంపై పలువురు హర్షం వ్యక్తంచేస్తున్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ జుక్కల్ నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తున్న జగద్గురు నరేంద్ర ఆచార్య మహారాజ్ భక్తులకు అభినందించారు. ఒకరు చేసే రక్తదానం మరొకరికి ప్రాణదానమవుతుందని గుర్తు చేశారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఎంతో పురోగతి సాధించినర రక్తాన్ని మనిషి సేకరించాల్సిందే తప్ప కృత్రిమంగా తయారు చేయలేమని, రోడ్డు ప్రమాదాల్లో గాయపడినప్పుడు కాన్పులు, ఆపరేషన్స్ సందర్భాల్లో ఇతర ఏ కారణంతోనైనా రక్తాన్ని కోల్పోయినప్పుడు రక్తహీనత ఉన్న వారిక రక్తం ఎక్కించాల్సి వస్తుందని, అవసరమైన సందర్భాల్లో వెతికితే అవసరమైన రక్తం దొరకదని, అందుకే ముందుగా రక్తదాన శిబిరాలన ఏర్పాటు చేసి రెడ్ క్రాస్ సొసైటీలో నిల్వ చేయడం జరుగుతుందని సూచించారు. ప్రతి ఒక్కరు రక్తదానం చేయడం వల్ల మరోకరి ప్రాణాలు రక్షించబడతాయని, ఈ శిబిరాలలో యువకులు, మహిళలు పాల్గొని రక్తదానం చేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. నిర్వాహకులు మాట్లాడుతూ జుక్కల్ నియోజకవర్గంతో పాటు జిల్లాలోని ఆయా మండలాల్లో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మద్నూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పరమేష్ పటేల్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు హన్మాండ్లు స్వామి, భక్తులు గంగారాం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

శబరిమలలో స్వాములకు ఎమ్మెల్యే అన్నదానం

పెద్ద కొడప్‌గల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రంలో శబరిమల అయ్యప్ప దర్శనానికి వెళ్లిన స్వాములకు హైదరాబాద్ భాగ్యనగర్ సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శబరిమల అయ్యప్ప దర్శనానికి వెళ్లిన జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావ్ అన్నదాన శిబిరాన్ని సందర్శించి అక్కడ స్వాములకు అన్నం వడ్డించారు. అంతేగాక అన్నదాన సత్రంలోనే సామాన్య భక్తుడిగా కూర్చుని ఎమ్మెల్యే తోట భోజనం చేశారు. ఈ సందర్భంగా తోట మాట్లాడుతు తెలంగాణ రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండటంతో పాటు రానున్న వర్షకాలంలో మంచి వర్షాలు కురిసి ప్రజలంతా అభివృద్ధి చెందాలని అయ్యప్పను వేడుకున్నట్లు తోట తెలిపారు.

అన్న ప్రసాద వితరణలో పాల్గొన్న ఎమ్మెల్యే

మద్నూర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : కేరళలోని శబరిమల అయ్యప్ప స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు, భాగ్యనగర్ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో కొనసాగుతున్న అన్న ప్రసాదం వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. జుక్కల్ నియోజకవర్గంలోని మద్నూర్, బిచ్కుంద మండలాలకు చెందిన అయ్యప్ప స్వాముల సహాయ సహకారాలతో కొనసాగుతున్న అన్న ప్రసాదం వితరణ కార్యక్రమంపై ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు. జుక్కల్ నియోజకవర్గానికి చెందిన వారు ఇక్కడ భక్తులకు కడుపునిండా భోజనం పెట్టడం చాలా ఆనందాన్ని కలిగించిందని చెప్పారు. ఆకలితో అలమటించే భక్తులకు ఉచితంగా అన్న ప్రసాద వితరణ చేయడం అందులో కేరళ రాష్ట్రంలో చేయడం అభినందించదగ్గ విషయమని అన్నారు. భాగ్యనగర్ అయ్యప్ప సేవాసమితి అధ్యక్షులు రాధాకృష్ణ, గురు స్వాములు రామ్ మోహన్, గురు స్వామి, మల్లారి రఘు గురు స్వామి, గురు స్వామి, తైదల్వార్ రవి స్వామి ఉన్నారు.



సినిమా గైడ్ కామారెడ్డి

కామారెడ్డి

శాంతి - రోటి కప్‌డా రోమాన్స్
దర్శన్ - యూఐ
ప్రియా 70 - పుష్ప-2
ప్రియా 35 - గేమ్ చేంజర్

బాన్సువాడ

మహేశ్వరి - పుష్ప-2
వెంకటేశ్వర - మ్యాక్స్



చికెన్ ధరలు

రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	120	140	160
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

